ఈనాడు
అనంతపురం
బుధవారం అక్టోబరు 16, 2024

అనంతకు టీజీ.. శ్రీసత్యసాయికి అనగాని

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం


టీజీ భరత్


అనగాని సత్యప్రసాద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై తరచూ పర్యవేక్షణ, పరిశీలన చేయడానికి జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించారు. ఇందుకు సంబంధించి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తగిన ఉత్తర్వు జారీ చేశారు. అనంత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కర్నూలుకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార శాఖల మంత్రి టీజీ భరత్, శ్రీసత్యసాయి జిల్లాకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను నియమించారు. ఆయా జిల్లాల్లో జరిగే అభివృద్ధి, సంక్షేమంపై పర్యవేక్షణ చేయనున్నారు. జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు పేదలకు చేర్చడమే వీరి ముఖ్యోద్దేశం. మరోవైపు.. అనంత జిల్లాకు చెందిన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నంద్యాల జిల్లాకు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవితను కడప జిల్లా, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జిగా నియమించారు. త్వరలోనే సంబంధిత మంత్రులు నిర్దేశిత జిల్లాల్లో పర్యటించనున్నారు.

నేడు మద్యం కొత్త దుకాణాల ప్రారంభం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో నేడు (బుధవారం) నూతన ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాలో 136, శ్రీసత్యసాయి జిల్లాలో 87 దుకాణాలను ఏర్పాటు కాబోతున్నాయి. దుకాణాలను దక్కించుకున్న వారు లైసెన్సు రుసుములు చెల్లించారన్నారు. మద్యం నిల్వలకు ఆన్‌లైన్‌లో ఇండెంట్‌లు తీసుకుని సోములదొడ్డి వద్దనున్న ఐఎంఎల్ డిపోలో అందజేశారని, కొందరు మంగళవారం రాత్రి సరకును దుకాణాలకు తరలించారని తెలిపారు.

బాలికల అభ్యున్నతికి కృషి


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సంయుక్త కలెక్టర్ శివనారాయణ్‌శర్మ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణ్‌శర్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. స్థానిక సైన్స్ సెంటర్‌లో విద్యాశాఖ సహకారంతో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ఝాన్సీ (జిల్లా పరిషత్తు పాఠశాల, రాయదుర్గం), కుముదా, (అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కురుగుంట), రుక్సానా (కేజీబీవీ, గుత్తి), వక్తృత్వ పోటీల్లో జయశ్రీ, (కేజీబీవీ, పెద్ద వడుగూరు), రిషిత, గీత (కేజీబీవీ, హనకనహాల్) చిత్రలేఖన పోటీల్లో గణేష్ (జడ్పీహెచ్ఎస్, హనకనహాల్) హాసిని (కేజీబీవీ, గుత్తి), తేజశ్రీ (బీసీ సంక్షేమశాఖ పాఠశాల నార్పల) విజేతలుగా నిలిచారు. వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించండి : ఎస్పీ

గుంతకల్లు గ్రామీణం, గుత్తి: అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ జగదీశ్ పోలీస్ సిబ్బందికి సూచించారు. గుంతకల్లు ఒకటవ, రెండవ, రూరల్, గుత్తి పోలీస్‌స్టేషన్లను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లాకప్‌గదులు, చార్టును, పరిసరాలను పరిశీలించారు. కేసుల నమోదు, దర్యాప్తు తీరుపూ ఆరాతీశారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మట్కా, చోరీలను అరికట్టే చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు మనోహర్, ప్రవీణ్‌కుమార్, మస్తాన్, ఎస్ఐలు రాఘవేంద్ర, గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేశ్ పాల్గొన్నారు.

24 గంటల వైద్య సేవలేవీ?

➠ పీహెచ్‌సీల్లో అరకొరే..

➠ పలుచోట్ల అందుబాటులో ఉండని వైద్యులు



వచ్చారు.. వెళ్లారు!

వజ్రకరూరు మండలం గడేహోతూరులో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో 11 గ్రామాలు ఉండగా రోజూ ఓపీకి 60 మంది వస్తున్నారు. నెలకు సగటున 2 కాన్పులు చేస్తున్నారు. కేంద్రంలో ఇద్దరు వైద్యులకు గాను ఒకరు ప్రసూతి సెలవులో ఉన్నారు. మంగళవారం ఉదయం 10.45 గంటలకు వైద్యుడు వచ్చారు. మధ్యాహ్నం 12.15 గంటలకు 104 వైద్యసేవలు ఉన్నాయంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. తరువాత విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టులే రోగులకు మందులు ఇచ్చి పంపారు. శుభ్రత అంతంతమాత్రమే. తాగునీటి ఫిల్టర్ పని చేయడం లేదు. నీటిక్యాన్‌ను మాత్రమే ఉంచారు.

అనంతపురం (వైద్యం), పుట్టపర్తి, ఉరవకొండ, చెన్నేకొత్తపల్లి, బెళుగుప్ప, అమడగూరు, న్యూస్‌టుడే

ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. 24 గంటల పాటు రోగులకు సేవలు అందించాలని ఓవైపు సర్కారు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆయా కేంద్రాలలో పనిచేస్తున్న కొంతమంది వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా వైద్యులు స్థానికంగా ఉండకుండా పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పలుచోట్ల రోగులకు స్టాఫ్‌నర్సులే చికిత్స చేస్తున్నారు. మధ్యాహ్నం దాటిన తరువాత వైద్యులు ఉండకపోవటంతో వచ్చిన కేసులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. మరోవైపు నెలకు కనీసం ఐదు నుంచి పది ప్రసవాలు పీహెచ్‌సీల్లో చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించినా పట్టించుకోవటం లేదు. దీంతో గర్భిణులు వ్యయప్రయాసలతో ఇతర ప్రాంతాల్లోని వైద్యశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి నెలా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి ప్రసవాల శాతం పెంచాలని ఆదేశిస్తున్నా ఆశించిన ఫలితం కనిపించలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పీహెచ్‌సీల్లో ప్రసవాల తీరును పరిశీలిస్తే.. అనంతపురం జిల్లా పరిధిలో 1,826, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 411 కాన్పులు జరిగాయి. మరోవైపు పలు పీహెచ్‌సీల్లో ఇతర సమస్యలు నెలకొన్నాయి.

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది..

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్, పబ్లిక్‌హెల్త్ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్‌తో కలిపి మొత్తం 14మంది ఉంటారు. రోగులకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలి. వివిధ రక్తపరీక్షలు చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. కేంద్రంలో ఆరు పడకలు ఉండాలి. వైద్యులు పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలి. రాత్రి వేళల్లో రోగులు వస్తే... విధుల్లో ఉండే సిబ్బంది ఫోన్ ద్వారా వైద్యుడికి సమాచారం ఇస్తే.. పీహెచ్‌సీకి వచ్చి రోగికి చికిత్స చేయాలి. చాలా కేంద్రాలలో రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు సిబ్బంది రెఫర్ చేస్తున్నారు.

కళ్యాణదుర్గం వెళ్లాల్సిందే..

బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యుల్లో ఒకరు సెలవులో ఉన్నారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో కళ్యాణదుర్గం వెళుతున్నారు. చిన్నపాటి ప్రమాదాలు జరిగినా ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు.

వైద్యపరికరాల కొరత

చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్‌లోని పీహెచ్‌సీలో గతంలో నెలకు సుమారు 15 నుంచి 20 ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం ఒకటి రెండు మాత్రమే నమోదవుతున్నాయి. దీంతో గర్భిణులు చాలా వరకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. సిజేరియన్ చేసేందుకు అవసరమైన వైద్యపరికరాలు అందుబాటులో లేవు.

ఇరు జిల్లాల్లో ఇలా..

జిల్లా	పీహెచ్‌సీలు	వైద్యులు
అనంత	45	90
శ్రీసత్యసాయి	41	82

అందరూ అందుబాటులో ఉండాలి

- ఈబీ.దేవి, మంజువాణి, డీఎంహెచ్‌వోలు, అనంత, శ్రీసత్యసాయి జిల్లా

పీహెచ్‌సీ వైద్యులు 20 కిలోమీటర్ల పరిధిలోనే నివాసం ఉండాలి. సాయంత్రం 4 గంటల తరువాత ఫోన్‌కాల్ చేస్తే అందుబాటులోకి రావాలి. రాత్రి సమయాల్లో వచ్చే క్షతగాత్రులు, రోగులకు వైద్యసేవలు అందించాలి. ప్రసవాల సంఖ్య పెంచాలని చెబుతున్నాం. కొన్ని చోట్ల సక్రమంగా అమలు కాని మాట వాస్తవమే. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకూ వైద్యులు విధిగా సేవలు అందించాలి. ఎవరైనా ఉండకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇతర సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరిస్తాం.


అమడుగూరు పీహెచ్‌సీలో నిరుపయోగంగా కొత్త సీసీ కెమెరాలు

ఆరు నెలలు.. ఎనిమిది ప్రసవాలు

అమడగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలలకు ఎనిమిది ప్రసవాలు చేశారు. సిజేరియన్ అవసరమైతుందనుకుంటే కదిరి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతోపాటు మానిటర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో కొత్తగా ఏర్పాటు చేసినవి నిరుపయోగంగా మారాయి.

ప్రగతి బాటలో పల్లెలు


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే సురేంద్రబాబు తదితరులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేపులపర్తిలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఉప కలెక్టర్ వినూత్న, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో అనేక గ్రామాల రహదారులు కంకరతేలి, గోతులు ఏర్పడటంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, కొత్త రోడ్లు మంజూరయ్యేలా చూడాలని కలెక్టర్‌ని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పదెకరాలు భూమి ఉన్నవారికి కూడా రేషన్‌కార్డులు, పింఛన్లు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బీటీపీ కాలువ తవ్వకానికి భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో చేపడుతున్న వివిధ పనులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించేందుకు త్వరలో కళ్యాణదుర్గంలో ఆర్డీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టర్.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డ్వామా పీడీ సలీం బాషా, ఏపీడీ రమేశ్ నాయక్, పీఆర్ డీఈ రాజన్న, ఎంపీడీవో నందకిశోర్, తహసీల్దార్ సుమతి, జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, తెదేపా నాయకులు మల్లికార్జునప్ప, శివశంకరప్ప, శ్రీరాములు, ధనుంజయ, తిప్పేస్వామి, వెంకటేశులు, శివన్న, సర్పంచి రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

'బాధితులను ఆదుకొంటాం'

హిందూపురం: మహిళలపై అత్యాచారానికి పాల్పడటం క్రూరమైన చర్య అని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియాబేగం పేర్కొన్నారు. మంగళవారం బాధితులను పరామర్శించిన ఆమె పట్టణ రెండో పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. దుర్మార్గులను వదలిపెట్టవద్దని, వీరు బెయిల్‌పై వచ్చినా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. బాధిత మహిళలను ఆదుకుంటామన్నారు.

ఒంటరిగా ఉన్న వారే లక్ష్యం

హిందూపురం, న్యూస్‌టుడే: చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టి అరెస్టయిన నిందితులు ఒంటరిగా ఉన్నవారు, భార్య, భర్తలున్న వారినే లక్ష్యంగా చేసుకొని దోపిడీ, అత్యాచారాలకు పాల్పడుతూ వచ్చారని ఎస్పీ వివరించారు. అరెస్టు చేసిన సమయంలో ఎస్పీ పలు విషయాలు వెల్లడించారు. కర్ణాటకతోపాటు రాష్ట్రంలోనూ అనేక ఘోరాలకు పాల్పడినట్లు వివరించారు. సంఘటనలో నిందితులకు ప్రత్యేక కోర్టుద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ఈ సంఘటనలో నిందితులను 48 గంటల్లో గుర్తించి అరెస్టు చేసినందుకు సీఎం, హోంమంత్రి, డీజీపీ జిల్లా పోలీసులను అభినందించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల ఆచూకీ గుర్తించటంలో డీఎస్పీ మహేశ్, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్‌కరీం, జనార్దన్, రాఘవ, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, క్రైం సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

నిందితులకు కఠినశిక్ష పడేలా సీఎం దృష్టికి తీసుకెళ్తా..

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం: అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి కోరతానని నియోజకవర్గం ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధికి వలస వచ్చిన మహిళలపై ఇలాంటి అఘాయిత్యం జరగటం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు తన సహకారం ఉంటుందన్నారు. హిందూపురంలో మహిళలకు భద్రత కల్పించే బాధ్యత తమదేన్నారు. ఇలాంటి వాటికి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అత్యాచారానికి గురైన కుటుంబానికి తనవంతు సహకారం ఉంటుందని, వీరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ సంఘటనలో నిందితులను 48 గంటల్లో అరెస్ట్ చేసిన పోలీసులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.



మట్కా చట్రం.. బతుకులు ఛిద్రం!

● చాపకింద నీరులా విస్తరిస్తున్న జూదం ● అరెస్టులున్నా యథేచ్ఛగా కొనసాగింపు

తాడిపత్రి పట్టణం నందలపాడుకు చెందిన ఓ వ్యక్తి భవన నిర్మాణ కార్మికుడు. రోజుకు రూ.800లు కూలీ వస్తుంది. వచ్చిన కూలి వచ్చినట్లే మట్కాలో పెడుతూ.. పనులు లేని రోజుల్లో వడ్డీకి డబ్బులు తెచ్చి మరీ ఆడుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లోకి దిగజారింది. ఇంటిని తాకట్టు పెట్టాడు. కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించింది.

అనంత నేరవార్తలు, తాడిపత్రి, పెద్దపప్పూరు, గుత్తి, న్యూస్‌టుడే: సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశ కొందరిని మట్కాకు వైపు నడిపిస్తోంది. వ్యసనపరులుగా మారుస్తోంది. రోజుకూలీలు, ఆటోడ్రైవర్లు దీనికి బానిసలుగా మారి సర్వం పోగొట్టుకుంటున్నారు. కొంతకాలంగా స్తబ్దుగా ఈ జాడ్యం మళ్లీ తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ఓ మాఫియా అవతారమెత్తింది.

ఆన్‌లైన్‌లోనూ అధికమే..

స్మార్ట్‌ఫోన్లలో కొన్ని మట్కా యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. కళ్యాణ్ మట్కా కింగ్, సత్తా మట్కా ఫాస్ట్ రిజల్ట్, ఎస్కే మట్కా అప్లికేషన్లలో ఎక్కువగా జూదమాడుతున్నారు. వీటిలో పదికి రూ.100లు వస్తుందని ఆన్‌లైన్ మట్కాకు అలవాటు పడ్డారు. యువత ఆన్‌లైన్ ఆటతో నష్టపోతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు రూ.లక్షల్లో మట్కా వ్యాపారం జరుపుతున్నట్లు సమాచారం.

నాయకులు, పోలీసుల అండ

ఆయా పట్టణాల్లో కొందరు రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్న వ్యక్తులే నిర్వాహకులుగా అవతారమెత్తుతున్నారు. తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. కొందరు పోలీసులు మట్కా ముఠాలతో సంబంధాలు పెట్టుకుని వారికి సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

గుత్తిలో జోరుగా..

గుత్తి మట్కాకు పుట్టిన ఇల్లు. 30 ఏళ్ల కిందట ఇక్కడ మట్కా బహిరంగంగా జోరుగా సాగేది. ఇక్కడికి కర్నూలు జిల్లా నుంచి ఆటగాళ్లు అధికంగా వచ్చేవారు. పురపాలికలో 25 వార్డులుండగా ప్రతి వార్డులో ముగ్గురు నలుగురు బీటర్లు ఉన్నారంటే ఏస్థాయిలో సాగుతోందో అర్థం అవుతోంది. దళితవాడ, బండగేరి, బీసీకాలనీ, చెర్లోపల్లి కాలనీ, గాంధీనగర్, గుత్తి ఆర్.ఎస్ తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతోంది.

ఏజెంట్లను నియమించుకుని...

కొందరు బడానాయకులు నిర్వాహకులుగా అవతారమెత్తుతూ తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కర్ణాటకలోని బళ్లారి పట్టణం కేంద్రంగా మట్కాను శాసిస్తున్నారు. నిర్వాహకులు రూపాయికి రూ.9, పదికి రూ.90 చొప్పున ఇస్తామని ఆశచూపుతూ పగలు రాత్రి అనే తేడా లేకుండా దందా నడిపిస్తున్నారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని కమీషన్లు ఇస్తూ మట్కా రాయిస్తున్నారు. మట్కా రాసే బీటర్లు నిర్వాహకులకు ఏజెంట్ల ఫోన్ల ద్వారా చేరవేస్తున్నారు. ఒక్క తాడిపత్రిలోనే ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు ఆటలకు సంబంధించి రూ.50 లక్షల వరకు మట్కా జరుగుతుందని అంచనా. తాడిపత్రి పట్టణంలో సిమెంటు, స్టీల్, గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో అక్కడ పని చేసే కార్మికులు ఎక్కువ సంఖ్యలో దీనివైపు బానిసలయ్యారు. పట్టణంలో 36 వార్డుల్లో 18 మంది మట్కా నిర్వాహకులు ఉన్నారు.

ఎక్కడ.. ఎలాగంటే!

● అనంతపురం నగరం పాతూరు పరిధిలో భవానీనగర్, రాణీనగర్, వేణుగోపాల్ నగర్, బుడ్డప్పనగర్‌లలో కొందరు ఇళ్లలోనే మట్కా కేంద్రాలు నడుపుతున్నారు. గుత్తి, టీవీ టవర్, తాడిపత్రి రోడ్డు శివార్లలో చెట్లపొదలు, ఖాళీ ప్రదేశాల్లో ఆడుతున్నారు. నగరంలో ఇటీవల పట్టుబడిన వారిలో మహిళలు కూడా ఉండటం గమనార్హం. ఈనెల 7న వన్‌టౌన్ పోలీసులు జరిపిన దాడుల్లో ఏడుగురు బీటర్లు పట్టుపడగా, వారి నుంచి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

● తాడిపత్రి పట్టణం అంబేడ్కర్‌నగర్, బస్టాండ్‌కూడలి, మెయిన్‌బజార్, గాంధీకట్ట, నందలపాడు, బండామసీదు విజయనగర్ కాలనీ, టైలర్స్ కాలనీల్లో ఆట యథేచ్ఛగా సాగుతోంది. తాడిపత్రి పట్టణంలోనే రోజులో రూ.అరకోటి వ్యాపారం జరుగుతోందని అంచనా.

● రాయదుర్గం, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో, ఉద్దేహాళ్, ఉంతకల్లు, గోనేహాళ్ క్రాస్ గ్రామాల్లో మట్కా మాఫియా రెచ్చిపోతోంది. బళ్లారి, ఎత్తిన బూదేహాళ్ నుంచి వచ్చే ఏజెంట్లు గుట్టుచప్పుడు కాకుండా మట్కా నిర్వహిస్తున్నారు.

నివారణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో మట్కా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. గత నెల 25 నుంచి ఈ నెల 14 వరకు మట్కా ఆడే 79 మందిని అరెస్టు చేశాం. 39 కేసులు నమోదు చేశాం. బీటర్ల నుంచి రూ.9 లక్షల 42 వేల నగదు స్వాధీనం చేసుకున్నాం. దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. త్వరలో మట్కా అనేది లేకుండా చేస్తాం.

- పి.జగదీశ్, ఎస్పీ, అనంతపురం

జల సంరక్షణలో హంపాపురానికి జాతీయస్థాయి గుర్తింపు

లక్ష్మీనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జల సంరక్షణలో జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా రాప్తాడు నియోజకవర్గం పరిధి హంపాపురాన్ని కేంద్ర జలశక్తి అభియాన్ ఎంపిక చేసింది. 2022-23 సంవత్సరంలో హంపాపురం పంచాయతీ వాటర్ షెడ్ పథకం కింద ఎంపిక కాగా 2023-24 సంవత్సరం పరిధిలో నీటి సంరక్షణ కోసం వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. వాటర్ షెడ్ పథకం అమలు కాకముందు పంచాయితీ పరిధిలో 31 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవి. వాటర్‌షెడ్, ఉపాధి హామీ పథకం కింద కందకాలు, రాతికట్టలు, చెక్‌డ్యాం, పారంపాండ్, నీటికుంటలు వంటి వివిధ రకాల 78 రకాల నీటి సంరక్షణ పనులను రూ.1.49 కోట్లు వెచ్చించి చేపట్టారు. భూగర్భజలాలు 25 మీటర్లపైకి వచ్చాయి. పంచాయితీ పరిధి గ్రామాల్లో వివిధ రకాల పంటలు, పండ్ల తోటలను రైతులు సాగు చేస్తున్నారు. వాటర్‌షెడ్, ఉపాధిహామీ పథకం కింద పంచాయితీ పరిధిలో చేపట్టిన పనులను కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి నాలుగు నెలల క్రితం వచ్చి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశవ్యాప్తంగా మూడు పంచాయితీలను కేంద్ర నీటి సంరక్షణ అవార్డుల కింద ఎంపిక చేయగా ఇందులో హంపాపురం ఉందని అనంతపురం జిల్లా డ్వామా పీడీ సలీం, అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈనెల 22న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి అవార్డులను అందజేస్తారని తెలిపారు.



సేద్యపుకుంటలో నీరు ఇలా..

శుభ్రత.. ఆరోగ్యానికి దోహదం : డీఆర్‌ఎం

గుంతకల్లు, న్యూస్‌టుడే : పరిశుభ్రత ఆరోగ్యానికి దోహదం చేస్తుందని డీఆర్‌ఎం విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయంలో రైల్వే డివిజన్‌లో నెలరోజుల పాటు కొనసాగిన స్వచ్ఛతా పక్వాడా (స్వచ్ఛ భారత్) ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే అది మనల్ని రోగాల బారిన పడకుండా చేస్తుందని చెప్పారు. శుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించాలని సూచించారు. నెలరోజుల పాటు రైల్వే స్టేషన్లు, హోటళ్లు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచేలా చేపట్టిన కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నారు. స్వచ్ఛతా పక్వాడాలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు. పరిసరాల శుభ్రతపై డీఆర్‌ఎం కార్యాలయం నుంచి వివిధ కాలనీల్లో చైతన్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్, కోఆర్డినేషన్ శ్రీనివాసులు ఇతర శాఖల అధికారులు, రైల్వే ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉద్యోగికి జ్ఞాపిక అందజేస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

నిందితుల కదలికలపై నిఘా ఉంచండి

హిందూపురం, న్యూస్‌టుడే: ఉప కారాగారంలో ఉన్న నిందితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సబ్‌జైల్ అధికారులకు జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సూచించారు. మంగళవారం హిందూపురం ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఎంత మంది నిందితులు ఉన్నారు. ఏ నేరాలపై వచ్చారు. వీరికి న్యాయవాదులు ఉన్నారా లేదా అనే విషయాలు జైలు అధికారి అంజినాయక్‌ను అడిగి తెలుసుకొన్నారు. సబ్‌జైల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వంటగది, పరిసరాలు, మరుగుదొడ్లు, గదులు శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి నిందితులతో నేరుగా మాట్లాడి ఆహారం, ఇతర సదుపాయాలు ఎలా ఉన్నాయని తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాది నవేరా, లోక్‌అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.



ఉపకారాగారంలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

పెనుకొండ: స్థానిక ఉపకారాగారాన్ని మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కారాగారంలోని బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, సరకుల నిల్వ గది, ఉచిత న్యాయ సలహా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. శిక్ష పూర్తయి బయటకువెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచించారు. ఆయన వెంట కారాగారం సూపరింటెండెంటు అజ్గర్‌హుస్సేన్, లోక్ అదాలత్ కోర్టు సిబ్బంది ఉన్నారు.

వాల్మీకుల చిరకాల కోరిక తీర్చండి: కాలవ

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), రాయదుర్గం: న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాల కాలంగా వాల్మీకి (బోయ) ఎస్టీ జాబితాలోకి చేర్చాలన్న చిరకాల కోరికను తీర్చాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఎస్టీ పునరుద్ధరణ కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. మంగళవారం ఉండవల్లి ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే కలిసి వాల్మీకి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిశారు. ముందుగా ఈనెల 17న మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

● కణేకల్లులో డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాలలో స్పాంజి ఐరన్ పరిశ్రమలో లభించే ఉపాధి అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రారంభించాలన్నారు.

● రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకోవాలని కాలవ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నలుగురు వైద్యులు మాత్రమే ఉన్నారని, రోగులకు సేవలు అందించడానికి ఇబ్బందిగా మారిందని మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు.



మంత్రి లోకేశ్‌కు వాల్మీకి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

భారతావని ఒక్కతాటిపై నిలవాలి..

సోమందేపల్లి, న్యూస్‌టుడే: దేశంలో ప్రజలందరూ సమానమే. భారతావని ఒక్కతాటిపై నిలవాలనే నినాదంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రను చేపడుతున్నట్లు భాస్కర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురితో కలిసి చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం మధ్యాహ్నం సోమందేపల్లి మీదుగా సాగింది. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'రేస్ అక్రాస్ ఇండియా' పేరుతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నలుగురు కలిసి 3,723 కిలోమీటర్ల సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ సమైక్యత, సామరస్య పూర్వకంగా జీవనం సాగిస్తూ.. భారత దేశాన్ని ఒక్కతాటిపై నిలిపేందుకు కృషి చేయడం ద్వారా ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సైకిల్ యాత్రికుడు ఆశాభావం వ్యక్తం చేశారు.



అందరికీ ఆదర్శం అబ్దుల్ కలాం

పెనుకొండ, న్యూస్‌టుడే: భారత దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శనీయుడని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం ఆయన 93వ జయంతి సందర్భంగా అబ్దుల్‌కలాం సామాజిక సేవ కమిటీ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దగల అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు బాల్యంలో కలాం కష్టాలు పడినప్పటి నుంచి దేశ రాష్ట్రపతి అయ్యేంతవరకు, మిసైల్‌మ్యాన్‌గా పేరుపొందిన ఆయన విజయాలను గుర్తుచేసుకున్నారు. కలాం పిలుపు మేరకు యువత కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు, ఎన్డీఏ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు.



పూలమాల వేస్తున్న మంత్రి సవిత, తదితరులు

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ప్రస్తుత జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు 84 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి జరగాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను ఇదే నెల 23 నుంచి నిర్వహిస్తామని ఆమె తెలిపారు. 23న అనంత రెవెన్యూ డివిజన్, 24న కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్, 25న గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇంటర్వ్యూలు కొనసాగుతాయి. ఆయా డివిజన్ల ఆర్డీఓ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. మౌఖిక పరీక్షల తేదీల మార్పును అభ్యర్థినులు గమనించాలని ఆమె సూచించారు. ఇదే విషయాన్ని సీడీపీఓల ద్వారా తగిన సమాచారం పంపిస్తున్నామన్నారు.

నోటీసులివ్వకుండా తనఖా బంగారం వేలం

ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులపై కేసు నమోదు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : అనంతపురం నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషను పరిధిలో ఉన్న ఓ గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులపై మంగళవారం కేసు నమోదైంది. అనంత గ్రామీణంలోని ఆకుతోటపల్లికి చెందిన ప్రైవేటు ఉద్యోగి గంగాధర్ నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని కీర్తన గోల్డ్ ఫైనాన్స్ సంస్థలో ఈ ఏడాది ఏప్రిల్ 20న రెండు దఫాలుగా 336 గ్రాముల బంగారాన్ని తనఖా పెట్టాడు. మొత్తం రూ.18,71,682లు రుణం తీసుకున్నాడు. ఈ రుణంలో రూ.13,11,976కు సంబంధించి జులై 10న రూ.35 వేలు వడ్డీ చెల్లించాడు. మిగతా రుణానికి చెల్లించలేదు. ఫైనాన్స్ ప్రతినిధులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బంగారాన్ని వేలం వేశారు. ఈ విషయంపై బాధితుడు సంస్థ ఉద్యోగులను సంప్రదించినప్పటికీ స్పందించలేదు. పోలీసులను ఆశ్రయించాడు. రుణానికి వడ్డీ చెల్లించినప్పటికీ ఆభరణాలను వేలం వేసి తనను మోసం చేశారని బాధితుడు గంగాధర్.. ఫైనాన్స్ మేనేజర్ నారాయణ నాయక్, సేల్స్ మేనేజర్ లక్ష్మీప్రసాద్‌లపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిశ్రమల శాఖ అధికారిగా శ్రీధర్ బాధ్యతల స్వీకారం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా పరిశ్రమలశాఖ అధికారిగా (డీఐఓ) జీఎం శ్రీధర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి అధికారి నాగరాజారావును అనకాపల్లికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే స్థానంలో పని చేస్తున్న శ్రీధర్ అనంత డీఐఓగా బదిలీపై వచ్చారు. ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న ఏడీ రాజశేఖర్‌రెడ్డి డీఐఓ బాధ్యతలను అప్పగించారు. పదవీ బాధ్యతలు తీసుకున్న కొత్త డీఐఓ శ్రీధర్‌కు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల పురోభివృద్ధికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించే ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

గొర్రెల దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని మనిగే రంగయ్యానాయుడుకు చెందిన గొర్రెలను దొంగిలించిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నరేంద్రారెడ్డి, ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 11వ తేదీ రాత్రి మిట్టపల్లి రంగయ్యానాయుడుకు చెందిన 10 గొర్రెలను దుండగులు దొంగిలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం పోలీసులు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో కొత్తరోడ్డు వనుకువారిపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వీరిలో ప్రకాశం జిల్లా బాపట్లకు చెందిన శివశంకర్‌తో పాటు అతడి మిత్రుడు వెంకటేశ్వర్లు, మిట్టపల్లికి చెందిన వరప్రసాద్, చీరాలకు చెందిన పాల్‌రాజు ఉన్నారు. వీరంతా మద్యానికి బానిసై ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. పట్టుబడిన దొంగల్లో శశికుమార్, వెంకటేశ్వర్లపై బాపట్లలోనూ చోరీ కేసు నమోదైనట్లు గుర్తించారు. గొర్రెలతో పాటు, ఆటోను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వివరించారు. సమావేశంలో ఏఎస్సైలు రమణారెడ్డి, కిశోర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం



మృతిచెందిన గురుప్రసాద్

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల పంచాయతీ ఉబ్బరవాండ్లపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి గురుప్రసాద్(19) అప్పుల బాధతో ఉరివేసుకొని బలవన్మరణం చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవికాంత్ తెలిపారు. వివరాలు.. ఉబ్బరవాండ్లపల్లికి చెందిన గురుప్రసాద్ తలుపుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతని తండ్రి రవికుమార్ నాలుగేళ్ల కిందట చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణం చెందాడు. ఆయన చేసిన అప్పులు పెరిగిపోయి పిల్లల పాలిట గుదిబండగా మారాయి. వాటితో మనస్తాపానికి గురైన విద్యార్థి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి తల్లి సాయిలీల చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.


అప్పుల బాధతో చేనేత కార్మికుడు..

ధర్మవరం: అప్పుల బాధ తాళలేక ధర్మవరం సత్యసాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మంజునాథ్ (37) విష ద్రావణం తాగి బలవన్మరణం చెందారు. సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేసిన మంజునాథ్‌ను కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం పొందుతూ మంగళవారం మృతి చెందారు. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన మంజునాథ్‌కు 14 ఏళ్ల కిందట ధర్మవరానికి చెందిన సుప్రియతో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చేనేత మగ్గం నేస్తూ జీవనం చేసే మంజునాథ్ తెలిసినవారు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశారు. కొంతకాలంగా వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో అప్పుల బాధ భరించలేక విష ద్రావణం తాగి మంజునాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని భార్య సుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధర్మవరం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు విడిపోయారని మనస్తాపం

అనంత నేరవార్తలు: తల్లిదండ్రులు విడిపోవడంతో మనస్తాపానికి గురైన కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం గ్రామీణం తాటిచెర్లకు చెందిన నాగిరెడ్డి భార్యతో నాలుగేళ్ల క్రితం విడిపోయారు. ఆమె కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషులు పలుమార్లు పంచాయితీ చేసినా రాలేదు. తల్లి దూరంగా ఉండటం, కుమారుడు శివకుమార్ (17) ఒంటరితనాన్ని భరించలేకపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఇంటట్లో ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి కూలీ ..



రంగనాయకులు

తాడిపత్రి: తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన కూలీ రంగనాయకులు (50) మంగళవారం మధ్యాహ్నం చల్లవారిపల్లి గ్రామ సమీపాన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు. అతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం బాగా కాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని సీపీఐ కాలనీలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆ కాలనీకి చెందిన వృద్ధురాలు రంగమ్మ ఇంటి బయట కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి చిరునామా అడిగాడు. ఆమె మాట్లాడుతుండగా.. హఠాత్తుగా మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై వెళ్లిపోయినట్లు బాధితురాలు తెలిపారు. బంగారం గొలుసు విలువ రూ.2 లక్షలకు పైగా ఉందని వాపోయారు. దుండగుడు హెల్మెట్ ధరించాడని స్థానికులు తెలిపారు. సోమవారం రాత్రి అదే వీధికి చెందిన రామిరెడ్డి ద్విచక్రవాహనం కూడా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్, ఎమ్మెల్యేకు సమస్యలు తెలుపుతున్న నాయకులు

శెట్టూరు, న్యూస్‌టుడే: మండల సమస్యలను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి మంగళవారం మండల నాయకులు తీసుకెళ్లారు. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో నిర్వహించిన 'పల్లె పండగ'లో వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ తిప్పేస్వామి, అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి రామరాజు, సర్పంచి కుమార్, గురుప్రసాద్, నగేశ్ తదితరులు మండల వ్యాప్తంగా దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

ఆడపిల్లలను సంరక్షిద్దాం



మాట్లాడుతున్న వైద్యాధికారి రమేశ్

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: ఆడపిల్లలను రక్షించడంతోపాటు చదివిస్తే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని వైద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బాలిక పాఠశాలలో 'బేటీ బచావో - బేటీ పఢావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల మాతా శిశు మరణాలు అధికమవుతున్నాయన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నేరమని, ఆడ, మగ తేడా లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆరోగ్య విద్య బోధకులు లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ శ్రీదేవి, సీహెచ్‌వో మురళీధర్, సూపర్‌వైజరు ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు గుంతలతో జాగ్రత్త!



కళ్యాణదుర్గంలోని గాంధీ కూడలి నుంచి మేదర వీధికి వెళ్లే దారిలో ఒకే చోట ఐదు మురుగు గుంతలు ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల ఉండటంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఇరుక్కుంటున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వర్షం వచ్చిందంటే గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడాల్సిన దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతల నుంచి రక్షణ కల్పించాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

సమస్యల వలయంలో కాలనీలు

● సౌకర్యాల లేమితో ఇక్కట్లు



శాంతి, సాయినగర్‌లను కలుపుతూ వెళ్లే మట్టి రహదారి దుస్థితి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలోని పదో వార్డు, శాంతి నగర్, సాయినగర్‌లలో దాదాపు 2 వేల వరకు నివాస గృహాలున్నాయి. సుమారు 8 వేల వరకు జనాభా ఉంటుంది. పదో వార్డులో సిమెంటు దారులు ఉన్నా మురుగు కాలువల సమస్య ఉంది. కొన్నేళ్ల కిందట చిన్నవిగా నిర్మించారు. కాలువల గోడలు శిథిలం అవుతుండటంతో నీరు పారడం కష్టంగా ఉంది. మాజీ సర్పంచి ఇంటి సమీపంలో విద్యుత్తు స్తంభం కింది భాగంలో నెర్రలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడానికి పక్కనే మరో స్తంభాన్ని అధికారులు చేసి పట్టించుకోలేదు. స్తంభం ఇళ్లపై కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

● శాంతినగర్‌ను కలుపుతూ బళ్లారి జాతీయ రహదారి దిశగా వెళ్లే ప్రధాన రహదారి శిథిలమైంది. గత ఐదేళ్లలో ఆధునికీకరణకు నోచు కోలేదు. అధికార యంత్రాంగం కనీసం మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవు. ట్యాంకులకు సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

● సాయినగర్‌లో వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే కాలనీలో పక్కా దారుల నిర్మాణం జరగలేదు. నేటికి మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా దారులు బురదగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ వివరణ కోరగా.. పరిశీలించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: ఉరవకొండ నుంచి వజ్రకరూరు మండలం హోతూరు మీదుగా గుంతకల్లుకు వెళ్లే దారి ముళ్లపొదలతో కప్పేసింది. **- మనోహర్ నాయుడు**
సమాధానం: వెంటనే తొలగింపు పనులు చేపడతాం. **- కావ్య, ఆర్‌అండ్‌బీ ఏఈఈ**

సమస్య: బెళుగుప్ప శివాలయం వద్ద ప్రధాన రహదారిలో మురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. **- స్వామి**
సమాధానం: పంచాయతీ సిబ్బందితో కాలువను శుభ్రం చేయిస్తాం. **- లక్ష్మీనారాయణ, ఎంపీడీవో**

సమస్య: మండల కేంద్రంలో చిన్నపాటి వర్షానికే మురుగు ప్రధాన రహదారిపై ఏరులై పారుతోంది. **- స్థానికులు**
సమాధానం: మురుగు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: ఆండేపల్లిలో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- మల్లేశ్**
సమాధానం: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: జెల్లిపల్లి రహదారిలో కంకర తేలి గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- బాబు**
సమాధానం: త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తాం. **- రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: మండలంలోని తిమ్మసముద్రం బీసీ కాలనీలో ప్రధాన రహదారిలో వర్షపునీరు నిల్వ ఉండటంతో ఇబ్బందిగా ఉంది. **- ఆనంద్**
సమాధానం: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- రంగనాథ్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, ఉరవకొండ, బెళుగుప్ప, కంబదూరు, కళ్యాణదుర్గం గ్రామీణం

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి: సీపీఎం

● ఉంతకల్లులో బస్సుయాత్ర ప్రారంభం



హెచ్చెల్సీ గట్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బొమ్మనహాళ్, రాయదుర్గం, కణేకల్లు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాకు తాగు, సాగునీరు అందించే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో తగినన్ని నిధులు అధికార పార్టీలు కేటాయించకుండా నిర్వీర్యం చేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. మంగళవారం ఉంతకల్లులో హెచ్చెల్సీ వద్ద ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే హెచ్చెల్సీ ఆధునికీకరణ, ఉంతకల్లు రిజర్వాయర్ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ గట్లు, లైనింగ్, వంతెనలు దెబ్బతిని సాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. ఈనెల 21న అనంతపురం కలెక్టరేట్ వద్ద బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. అనంతరం బస్సు యాత్ర కణేకల్లు, రాయదుర్గంలో కొనసాగింది. సీపీఎం కర్ణాటక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్తిబాబు, కవుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలరంగయ్య, నాయకులు నాగేంద్ర, చంద్రశేఖర్, నాగమణి, కృష్ణమూర్తి, అచ్యుత ప్రసాద్, రంగారెడ్డి, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గం: సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహికులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం సాంఘిక సంక్షేమాధికారి దామోదర్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జ్ఞానభూమి ఏపీ.గవర్నమెంట్.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కణేకల్లు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్‌కలాం



కుందుర్పి: అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్‌కే ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న విలువల బడుల్లో మంగళవారం మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని, ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా చదువుకుని దేశానికి సేవలందించాలని ఉపాధ్యాయులు సూచించారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: తరతరాల విద్యార్థి లోకానికి, శాస్త్రీయ విజ్ఞానానికి మార్గ నిర్దేశకులు అబ్దుల్ కలాం అని ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ అన్నారు. మండలంలోని దొడగట్ట ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రాజన్న, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజన్న, నాగలత, రవికిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

దాడి చేశారని జడ్పీటీసీ సభ్యుడి ఫిర్యాదు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 13న దేవిరెడ్డిపల్లి గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై తెదేపా నాయకులు దాడి చేశారంటూ మంగళవారం రాయదుర్గం యూపీఎస్ సీఐ జయనాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు రాయదుర్గం జడ్పీటీసీ సభ్యుడి మల్లికార్జునపై తెలిపారు. ఆవులదట్లకు చెందిన తెదేపా నాయకుడు, సర్పంచి వన్నూరుస్వామితో పాటు ఆరుగురు కర్రలు, మారణాయుధాలతో దాడిచేసి హత్య ప్రయత్నం చేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. వైకాపా నాయకులు రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, పాటిల్‌రఘు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

తమను కొట్టారని సర్పంచి..

● రాయదుర్గం జడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, ఆయన స్నేహితుడు రఘు తనపై ఈనెల 13న బొమ్మక్కపల్లి- దేవిరెడ్డిపల్లి జాతీయ రహదారిపై దాడిచేసి కొట్టారని సీఐ జయనాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆవులదట్ల సర్పంచి వన్నూరుస్వామి తెలిపారు. జడ్పీటీసీ మల్లికార్జున మొక్కజొన్నల వ్యాపారం చేస్తారని, గ్రామంలోని రైతుల వద్ద నుంచి తనకు అప్పుగా ఇప్పించాలని కోరగా, అందుకు ఒప్పుకోకపోవడంతో మద్యం మత్తులో తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వెంట తెదేపా నాయకులు వీరేశ్‌స్వామి, సోమశేఖర్, తిమ్మారెడ్డి, సర్పంచి వన్నూరుస్వామి, పట్టణ తెదేపా యూత్ కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు ఉన్నారు. ఇరువర్గాల ఫిర్యాదులపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పన్నుల వసూళ్లకు చర్యలు చేపట్టండి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో ఆస్తి, నీటి పన్నులు వందశాతం వసూళ్లకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డిలు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో మంగళవారం మున్సిపల్ ఇంజనీర్లు, సచివాలయం అమినిటీ కార్యదర్శుల సమావేశంలో వారు మాట్లాడారు. పురపాలక సంఘంలో పేరుకుపోయిన రూ.4 కోట్లు, ఖాళీ స్థలాల పన్నులు రూ.2 కోట్ల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పన, ఒప్పంద ఉద్యోగుల జీతాలు, విద్యుత్తు బకాయిల చెల్లింపులకు నిధుల ఆవశ్యకత ఉందన్నారు. తాగునీటి పైపుల లీకేజీలను అరికట్టాలని, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ డీఈ రవిప్రకాశ్ నాయుడు, మున్సిపల్ ఏఈలు నరసింహులు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీటి నిల్వపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని నింబగల్లు బీసీ కాలనీలో సిమెంటు దారిపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. దారిపై మట్టి పేరుకు పోవడంతో చాలా కాలంగా నీటి నిల్వ అలాగే ఉందని, ఇప్పుడు భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి మరింత దారుణంగా మారనుందన్నారు. నీరు ముందుకు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు.

● సాధారణ ఎన్నికల విధుల్లో నెల రోజుల పాటు పాల్గొన్నా, ఇప్పటి వరకు వేతనం ఇవ్వలేదని పట్టణానికి చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్లు వాపోయారు. ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మంగళవారం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం ఇచ్చారు. తమకు నిర్దేశించిన ప్రకారం రూ.3 లక్షలకు పైగా వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించాలని కోరారు.

పంటలు తొలగించవద్దు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రానున్న మూడు రోజులు అధిక వర్షాలు ఉన్నందున రైతులు పంటలు తొలగించరాదని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని 74 ఉడేగోళంలో రైతు సేవా కేంద్రంలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో పాల్గొన్నారు. వేరుసెనగ తొలగించిన రైతులు వర్షంలో తడవకుండా రక్షించుకోవాలన్నారు. మొక్కజొన్న రైతులు తమ పంటలను రోడ్లపై ఆరబెట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉన్నందున సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. సర్పంచి దురుగమ్మ, ఏఓ మహేంద్ర, ఏఏఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని కొత్తపల్లిలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్ రైతులకు పలు సూచనలు చేశారు.



ఉరవకొండ: చిన్న ముష్టూరులో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు



రాయదుర్గం గ్రామీణం: పల్లేపల్లిలో..



గుమ్మఘట్ట: సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

గ్రామాభివృద్ధే లక్ష్యంగా అడుగులు



బ్రహ్మసముద్రం: వేపులపర్తిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఉప కలెక్టర్ వినూత్న

గ్రామాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అధికారులు, నాయకులు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**



బొమ్మనహాళ్: దర్గాహొన్నూరులో..

హోటల్ సీజ్.. నోటీసులు జారీ

కళ్యాణదుర్గం గ్రామీణం: హోటళ్ల నిర్వాహకులు శుభ్రత పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలోని ఓ హోటల్‌లో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. హోటల్ భవనం పైభాగంలో అనుమతి లేకుండా నిర్మించారని గుర్తించారు. వంట చేసే ప్రదేశం శుభ్రంగా లేకపోవడం, మరుగుదొడ్లు లేక అపరిశుభ్రంగా ఉందన్నారు. ఇంటికి ఉపయోగించే వంటగ్యాస్‌ను వాడుతుండటంతో సీజ్ చేసి నోటీసులు ఇచ్చామన్నారు. ఇందుకు సంబంధించి నివేదికను కలెక్టర్‌కు పంపుతామన్నారు. పౌరసరఫరాల ఉప తహసీల్దారు దుర్గాప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ నూర్‌అలీఖాన్, భవన నిర్మాణ తనిఖీ అధికారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: సమయపాలనతో పాటు విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో రామచంద్ర సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం గోళ్ల సచివాలయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. సమస్యలపై వచ్చే దరఖాస్తులను ఎంతవరకు పరిష్కరించారని అడిగి తెలుసుకొన్నారు. వీధుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని తెలిపారు. ఈవోఆర్డీ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల అధికారిగా బాధ్యతల స్వీకరణ

కుందుర్పి : మండల నూతన పౌరసరఫరాల అధికారిగా రాజశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ చౌకదుకాణాల నుంచి నిత్యావసర సరకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

బస్సు ఢీకొని.. హోంగార్డుకు గాయాలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని స్థానిక టీకూడలిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులును ఉరవకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నప్పుడు ఉరవకొండకు బయల్దేరిన బస్సు ఢీకొనడంతో కిందపడ్డారు. కుడికాలుపై చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా సుంకులాంబదేవి తెప్పోత్సవం



తుంగభద్ర హెచ్చెల్సీలో సుంకులాంబదేవి జలవిహారం

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని మాల్యంలో మంగళవారం సుంకులాంబదేవి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తుంగభద్ర హెచ్చెల్సీలో జలవిహారం చేయించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

బోధనలో అలసత్వం వద్దు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలను బోధించడంతో ఎలాంటి అలసత్వానికి అవకాశం ఇవ్వొద్దని ఎంపీడీవో రవిప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని చిన్న ముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు.

ముంపునకు గురి కాకుండా చర్యలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఉద్దేహాళ్‌లో తిమ్మలాపురం రోడ్డు నుంచి వర్షపునీరు బీసీ కాలనీలోకి వెళ్లి ముంపునకు గురికాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఈవోఆర్డీ దాస్, పంచాయతీ కార్యదర్శి శివన్న ఆధ్వర్యంలో సిబ్బంది పొక్లెయిన్‌తో కాలువలో పూడికను తొలగించారు. వర్షపునీరు ఇళ్లలో చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి పూడికను తొలగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాలనీ ముంపునకు గురి కాకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు.

అక్రమ మద్యం స్వాధీనం

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని హనకనహాళ్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అనిల్ వద్ద నుంచి 27 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోఆప్షన్ సభ్యుడి దౌర్జన్యం



పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు లిడియామేరి గ్రేస్, పక్కన కోఆప్షన్ సభ్యుడు సలీమ్


ఉరవకొండ, న్యూస్‌టుడే: పాఠశాల నాదంటూ వైకాపా మద్దతుతో ఎన్నికైన మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సలీమ్ కరస్పాండెంట్‌పై దౌర్జన్యానికి దిగిన ఘటన ఉరవకొండలో చోటు చేసుకుంది. బాధితురాలు లిడియా మేరి గ్రేస్ తెలిపిన వివరిలిలా.. ఆమెకు సంబంధించిన పట్టణంలోని ప్రైవేటు పాఠశాలను ఆయనకు అద్దెకు ఇచ్చారు. ఆ గడువు ఈ ఏడాది జనవరితో ముగిసింది. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ఆయన పాఠశాల వద్దకు రాలేదు. ఈ క్రమంలో పాఠశాల మూతపడకుండా ఆమె దానిని నడిపించే బాధ్యతను తీసుకున్నారు. స్థలాన్ని ఆమె పేరుతోనే అద్దెకు తీసుకుని పాఠశాల యధావిధిగా నడిపిస్తున్నారు. నాలుగు నెలల తరువాత ఇప్పుడు వచ్చి పాఠశాల తనదని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ రెండు రోజులుగా దౌర్జన్యం చేస్తున్నాడు. మంగళవారం కూడా పాఠశాలకు చేరుకుని ఆమెపై దౌర్జన్యానికి దిగి దుర్భాషలాడారు. ఆమె 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకుని ఆయన్ని పాఠశాల నుంచి బయటికి పంపారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

వైకాపాలో క్రియాశీలకంగా..

మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా ఉన్న పామిడి సలీమ్ గత సాధారణ ఎన్నికల ముందు వైకాపా తరుపున పట్టణంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి, ఆయన తనయుడి తరువాత తానే వైకాపాలో ముఖ్యుడన్నట్లుగా చలామణి అయ్యారు. వైకాపా శ్రేణులను దాడులకు ఉసిగొల్పాడు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి మూడు నెలల పాటు కనిపించకుండ పోయాడు. ఆ తరువాత వచ్చి వైకాపాకు రాజీనామా పేరుతో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి, ఇప్పుడు కొంతమంది అధికారుల సహకారంతో మళ్లీ వైకాపాలో మాదిరి తన దౌర్జన్యాలను తిరిగి ప్రారంభించే ప్రయత్నం చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

జోరుగా జూదాలు.. పోలీసులకు సవాళ్లు

● వ్యసనాలకు బానిసవుతున్న యువత





కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణంలో జూదాలు జోరందుకున్నాయి. యువకులు జూదాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గత సెప్టెంబరులో ఇరువర్గాలకు చెందిన వారు వాల్మీకి కూడలిలో దాడులు చేసుకొన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం వాటిని అరికట్టలేకపోతున్నారు. సమాచారం తెలుసుకొని దాడులు చేస్తున్న పరారవుతూ సవాల్‌గా మారుతున్నారు. పట్టణంలోని వాల్మీకి కూడలి, కంబదూరు, మల్లాపురం, బళ్లారి బైపాస్, బళ్లారి మిట్ట తదితర ప్రాంతాల్లో ఎక్కువగా జూదాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. పోలీసులు ప్రత్యేక చొరవ చూపి అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

✦ యువకులు గుంపుగా చేరి ఆ మార్గంలో వెళ్లే వాహనాలు, వాటి నంబర్లపై బెట్టింగ్‌లు వేస్తున్నారు.

✦ క్రికెట్ ఉన్నప్పుడు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ✦ కొన్ని చోట్ల నిమ్మకాయలు, టెంకాయలు కొంత దూరం విసరడం, బిల్లాట జరుగుతున్నాయి.

✦ లోగుట్టుగానే మట్కా నిర్వహిస్తూ నగదును చేతులు మారుస్తున్నారు.

ఈ విషయమై పట్టణ సీఐ వెంకటరమణను వివరణ కోరగా.. పూర్తిస్థాయిలో పరిశీలించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ప్రజల సహకారంతో జూదాలను అరికట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

దుర్గంలో ఓటరు సర్వే పూర్తి



సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల సర్వే కార్యక్రమం ఈనెల 7వ తేదీతో పూర్తయింది. ఆగస్టు 20వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేశారు. మృతులు, శాశ్వత వలస ఓటర్ల తొలగింపు, సవరణ దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే డ్రాఫ్ట్ ఎలక్టరోల్‌ను ఈనెల 29న ప్రచురించనున్నారు. వాటిపై అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ వరకు స్వీకరించి జనవరి 6న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

● చేర్పులు - 1035
● తొలగింపులు - 1055
● మార్పులు - 1291

● ఓటర్ల జాబితాలో చేరేందుకు ఫారమ్-6 కింద 1,581 దరఖాస్తులు రాగా పరిశీలన తర్వాత 512 దరఖాస్తులను తిరస్కరించారు. 1035 దరఖాస్తులను అనుమతించగా 34 పెండింగ్‌లో ఉన్నాయి. ఫారమ్-7 కింద తొలగింపులకు 1365 దరఖాస్తులు రాగా 50 దరఖాస్తులను తొలగించారు. 1055 దరఖాస్తులను అనుమతించగా 235 పెండింగ్‌లో ఉన్నాయి. ఫారమ్- 8 కింద మొత్తం 1,446 దరఖాస్తులు రాగా 80 తొలగించి 1291 దరఖాస్తులను అనుమతించారు. 72 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలిలా..

● నియోజకవర్గంలో సెప్టెంబరు 26వ తేదీ వరకు మొత్తం 2,64,408 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,30,808 మంది, 1,33,558 మంది స్త్రీలు, 42 మంది ఇతరులు ఉన్నారు.

● 18-19 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఓటర్లు నియోజకవర్గంలో.. కొత్త ఓటర్లు మొత్తం 7,266 ఉండగా 4,094 మంది పురుషులు, 3,170 మంది స్త్రీలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు.

తుది జాబితా జనవరి 6న విడుదల

ఓటర్ల సర్వే 7వ తేదీతో ముగిసింది. ఈనెల 29న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసి 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు

- సుజాతాదేవి, ఈడీటీ, రాయదుర్గం


జన బాంధవునికి జన్మదిన శుభాకాంక్షలు
గుమ్మనూరు ఈశ్వర్
గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్
R.R. Ramesh
పామిడి మండల టీడీపీ సమన్వయ కర్త
చెరగని చిరునవ్వుతో స్నేహానికి ప్రతిరూపంగా అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ
అన్నింటికి మించి మానవత్వానికి నిలువెత్తు రూపమైన మా ప్రియతమ నాయకులు
గుంతకల్లు శాసనసభ్యులు గౌ॥ శ్రీ గుమ్మనూరు జయరాం గారికి ఇవే మా
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
ఆర్.రాజేష్ నాయక్
అనంతపురం పార్లమెంట్ తెలుగుదేశం
పార్టీ కార్యదర్శి, ఉమ్మడి అనంతపురం
జిల్లా మత్స్యశాఖ సహకార డైరెక్టర్
రమేష్ నాయక్
మాజీ సర్పంచ్
టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు
వడ్డే అనంద్
మాజీ గుత్తి డివిజన్
ఆత్మ కమిటి చైర్మన్
రామాంజినేయ నాయక్
స్టేట్ కార్యనిర్వహణ కార్యదర్శి,
ఎస్టీ సెల్
పల్లె శ్రీనివాసులు
టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి
జయకుమార్
మాజీ ఎంపీటీసీ, ఎద్దులపల్లి
వెంకటేష్
టీడీపీ సీనియర్ నాయకులు
దేవదాసు
మాజీ మండల యూత్ అధ్యక్షులు
కదిరప్ప
మాజీ మండల యూత్ అధ్యక్షులు
రాజు
టీడీపీ సీనియర్ నాయకులు
గౌ॥ శ్రీ గుమ్మనూరు
జయరాం గారు
శాసన సభ్యులు, గుంతకల్లు
తేల్ బాషా
మాజీ కౌన్సిలర్
ఖలేంధర్
మైనారిటీ నాయకులు యూత్
రహిమాన్
మైనారిటీ నాయకులు
బాబా (వెల్డింగ్)
మైనారిటీ నాయకులు
మాలిక్
టీడీపీ నాయకులు
హరి
టీడీపీ యూత్, జి.కొట్టాల
సుంకప్ప
టీడీపీ సీనియర్
నాయకులు, ఎదురూరు
బోగాతి నాగిరెడ్డి
టీడీపీ సీనియర్ నాయకులు,
రామరాజుపల్లి
నరసప్ప
టీడీపీ యూత్
కొండాపురం
గోపాల్
టీడీపీ నాయకులు
యు.మంజునాథ్‌రావు
టీడీపీ నాయకులు
సురేష్‌రెడ్డి
టీడీపీ నాయకులు
కండ్లపల్లి
తిరుపాల్
టీడీపీ సీనియర్ నాయకులు,
తంబాలపల్లి

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

వసతి గృహాల్లో న్యాయమూర్తి తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని పలు వసతిగృహాలను మంగళవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి తనిఖీలు నిర్వహించారు. పట్టణ శివారులోని సమీకృత వసతిగృహంతోపాటు నంబర్-1, కోటలోని బీసీ వసతిగృహాన్ని జడ్జి పరిశీలించారు. వసతిగృహాల్లోని వంట గదులను చూశారు. మెనూ అమలు తీరుపై సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వార్డెన్లు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల్లో అమలవుతున్న మెనూను క్షుణ్ణంగా పరిశీలించారు. అసౌకర్యాలు, సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సమితిని ఆశ్రయించాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

'మా గ్రామంలో ఇసుక రీచ్‌లు వద్దు'

పుట్లూరు (యల్లనూరు), న్యూస్‌టుడే : యల్లనూరు మండలంలోని చిలంకూరులో అధికారులు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా దాన్ని ప్రజలు తిరస్కరించారు. ఇసుక రీచ్‌ల ఏర్పాటులో మైనింగ్, రెవెన్యూ సిబ్బంది గ్రామంలో పర్యటించగా ప్రజలు అడ్డుకున్నారు. గతంలో కూడా ఇలాగే రీచ్ ఏర్పాటు చేసి చిత్రావతి నుంచి అదనంగా వరద వచ్చి గ్రామం తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా మరోచోట రీచ్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని వారు అధికారులను కోరారు. దీంతో పుట్లూరు తహసీల్దారు శేషారెడ్డి, తదితర అధికారులు ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తామని భరోసా కల్పించారు.

బస్సు యాత్ర జయప్రదానికి పిలుపు

పామిడి : సాగునీటి విడుదల కోరుతూ సీపీఎం ఈ నెల 15న బొమ్మనహాళ్‌లో చేపట్టే బస్సుయాత్ర 17న పామిడికి చేరుకుంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి మల్లేశ్, సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి తెలిపారు. రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని బస్సుయాత్రను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని చెరువులు, కాలువలకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరందించాలని డిమాండు చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామాన్ని మంగళవారం ఎస్ఐ సురేశ్ తన సిబ్బందితో కలిసి సందర్శించారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడిన వారి ఇళ్లల్లో సోదాలు చేశారు. దిబ్బలు, పాడుపడిన ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. గ్రామంలో రికార్డులు లేని రెండు ఆటోలు, 6 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఏపీకు వీడ్కోలు

గుంతకల్లు : రైల్వే జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి సురేష్‌బాబు మంచి సేవలందించారని గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. ఏపీ గుంతకల్లు నుంచి తిరుపతికి బదిలీ కావడంతో మంగళవారం కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన్ను పోలీసులు, కార్యాలయ సిబ్బందితో పాటు ఎస్పీ సత్కరించారు.

అంతరిక్షంపై అవగాహన

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో వీసీ కోరి, డీన్ శీలారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు జరిపారు. వీటిలో విజేతలకు బహుమతులు అందించారు. అంతరిక్షంలో జరిగే మార్పుల గురించి చలన చిత్రాల ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. ఆచార్య మనోహర్‌కుమార్ మాట్లాడారు.

శివారు కాలనీలు.. కనిపించని వసతులు

☛ 64 పనులు చేపట్టాలని రూ.25 కోట్లు కేటాయింపు ☛ నిధులు పక్కదారి పట్టించిన వైకాపా ప్రభుత్వం


పొట్టిశ్రీరాములు రోడ్డులోని సీప్ పథకంకు చెందిన శిలాఫలకం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణ శివారు కాలనీల్లో వసతుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పన్నులు చెల్లిస్తున్నా.. తమకు సదుపాయాలు కల్పించరా? అని వారు ప్రశ్నిస్తున్నారు. శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు గత తెదేపా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేయడంలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. కేటాయించిన నిధులను వేరే పనులకు మళ్లించింది. ఫలితంగా శివారు కాలనీల ప్రజలు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనులను చేయడానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సీప్) పథకం కింద గత రూ. 25.47 కోట్లు కేటాయించారు. 2019 ఫిబ్రవరి 27న అప్పటి ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మున్సిపల్ అధ్యక్షురాలు కోడెల అపర్ణ పనులకు భూమిపూజ చేశారు.

వృథా అయిన టెండర్లు

సీప్ పథకం కింద శివారు కాలనీల్లోనే కాకుండా పట్టణంలోని మురికి వాడల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతు తదితర 64 పనులు చేపట్టేందుకు అధికారులు టెండర్లు నిర్వహించారు. పనులను గుత్తేదారులకు అప్పగించారు. ఇంతలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులను ఆపివేసింది. కేటాయించిన నిధులను దారి మళ్లించింది. దీంతో అధికారులు పనులను ప్రారంభించలేకపోయారు. టెండర్లు రద్దయిపోయాయి. టెండర్లను నిర్వహించిన సమయంలో వివిధ శివారు కాలనీలకు చెందిన ప్రజలు ఇక తమకు ఇబ్బందులు తీరిపోతాయని భావించారు. తరువాత నిధుల దారి మళ్లాయని, అధికారులు పనులను రద్దు చేశారని తెలిసి నిరాశకు గురయ్యారు. అధికారులు పనులను చేపట్టి పూర్తి చేసి ఉంటే కాలనీల్లో మంచి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేవి. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని శివారు కాలనీల ప్రజలు వాపోతున్నారు.

చిగురించిన ఆశలు

ప్రస్తుతం రాష్ట్రంలో తెదేపా నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీప్ పథకం కింద గుర్తించిన పనులు చేపడతారనే ఆశలు ప్రజల్లో చిగురించాయి. పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కృషి చేసి, వసతులు కల్పించాలని పట్టణ పౌరులు కోరుతున్నారు.

నిధులు రాబట్టేందుకు కృషి చేస్తాం

సీప్ పథకానికి సంబంధించిన నిధులను తిరిగి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి కేటాయించేలా కృషి చేస్తాం. విషయాన్ని ఎమ్మెల్యే జయరాం ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తాం. నిధులను కేటాయిస్తే శివారు కాలనీల ప్రజల కష్టాలు తీరుతాయి. నిధులను రాగానే టెండర్లు నిర్వహించి పనులు చేపడతాం.

- నయీం మహమ్మద్, మున్సిపల్ కమిషనర్

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ


పెద్దవడుగూరు: జేసీ శివనారాయణశర్మ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి

గుత్తి, న్యూస్‌టుడే : జిల్లా స్థాయిలో మంగళవారం నిర్వహించిన 'లింగ నిర్ధారణ చట్టం'పై వ్యాస రచన పోటీల్లో గుత్తి కస్తూర్బా గాంధీ పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రతిభ చాటారు. వక్తృత్వ పోటీలో రుషిత ద్వితీయ, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో హసిని ద్వితీయ, వ్యాసరచన పోటీలో రుక్సానా తృతీయ స్థానాల్లో నిలిచారు. జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ చేతులమీదుగా విద్యార్థినులతోపాటు సైన్సు గైడ్ గౌరీప్రభాంజలి ప్రశంసాపత్రం, నగదు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు కస్తూర్బాగాంధీ విద్యాలయం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని జయశ్రీ జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళవారం జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రంతోపాటు నగదు బహుమతులను సైన్సు ఉపాధ్యాయిని శోభారాణితో పాటు విద్యార్థిని అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఉష తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

స్కేటింగ్ పోటీల్లో పతకాలు


ప్రతిభ చాటిన స్కేటింగ్ క్రీడాకారులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు శిక్షకుడు మధు తెలిపారు. సోమవారం అనంతపురంలో స్కేటింగ్ పోటీలు జరిగాయని, అందులో అండర్-14 విభాగంలో హైందవి కాంస్యం, పూజిత రజితం, భాను అఖిల్ కాంస్య పతకాలు సాధించారు. అలాగే అండర్-17లో రామ్‌చరణ్ బంగారు, హేమంత్ రజితం, అండర్-19లో శ్రీహరి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

'తెదేపాకు విధేయులుగా పనిచేశాం'

అనంతపురం: తెదేపా ఆవిర్భావం నుంచి విధేయులుగా ఉంటూ ఎంతో కష్టపడి పనిచేశామని ఆ పార్టీ యల్లనూరు మండలం నాయకులు రాజేంద్రనాయుడు, సుదర్శన్‌నాయుడు, ధనుజయనాయుడు పుట్లూరు మండల కన్వీనర్ బాలరంగయ్యలు స్పష్టం చేశారు. రాజేంద్రనాయుడు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా మా కుటుంబం ఎన్నో కష్టాలు పడ్డామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మాపైన అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం, తాడిపత్రి, పులివెందల, కోవెలకుంట్ల, కడప సబ్ జైళ్లలో జీవితం అనుభవించామని ఆయన వాపోయారు. నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం మా సొంత నిధులు ఖర్చుపెట్టి పనిచేశామని, 2014లో జేసీ దివాకర్‌రెడ్డి, గెలుపునకు ఎంతో కృషి చేశామన్నారు. 2019లో ఎన్నికల్లో జేసీ పవన్‌రెడ్డికి కూడా మా మండలాల్లో మెజారిటీ పెంచేందుకు కృషి చేశామన్నారు. 2024లో మా ఎమ్మెల్యే గెలుపు కోసం ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో అందరం కలిసి పనిచేశామన్నారు. మా ప్రాణం ఉన్నంత వరకు తెదేపాలోనే ఉంటామని, వేరే పార్టీలకు వెళ్లే ఆలోచన కూడా తమకు లేదన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేయడం పట్ల తమకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు చొరవ చూపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పెద్దవడుగూరులోని గుత్తిరోడ్డులో ఉన్న దస్తగిరిస్వామి కట్టపై మంగళవారం ఉరుసు ఉత్సవాన్ని ముస్లిం మతపెద్దలు ఘనంగా నిర్వహించారు. దస్తగిరిస్వామి పీరును గ్రామపుర వీధుల గుండా ఊరేగించి కట్టవద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు పూజలు నిర్వహించారు. దస్తగిరి స్వామి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా గ్యార్మీని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దపప్పూరులోని రామకోటి కాలనీలో గ్యార్మీలో దస్తగిరిస్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన జెండాలతోపాటు స్వామి వారిని పుర వీధులగుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


స్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నేడు ఆర్‌ఎంపీలు, వాటర్‌ప్లాంటు యజమానులతో సమావేశం

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని ఆర్‌ఎంపీలు, ప్రైవేటు శుద్ధినీటి కేంద్రం యజమానులతో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాయంత్రం 4.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.


సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు


నృత్యం చేస్తున్న యువతులు

హనుమద్ వాహనంపై చింతలరాయుడు


హనుమద్ వాహనంపై కొలువుతీరిన స్వామి

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని చింతలరాయుని ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చింతల వెంకటరమణస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని హనుమద్ వాహనంపై కొలువుతీర్చి పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే ప్రొద్దుటూరులోని నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు చేసిన నాట్యం పలువురిని ఆకట్టుకున్నాయి. భక్తులకు కల్పించిన సౌకర్యాలను ఆలయ అధ్యక్షులు జలదుర్గం దామోదర్‌దాస్, సభ్యుడు వెంకట శేషఫణి పరిశీలించారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం


ప్రత్యేకాలంకరణలో శ్రీచౌడేశ్వరీదేవి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కొప్పలకొండలో వెలిసిన శ్రీచౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం మంగళవారం తెల్లవారు జామున వైభవంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో జ్యోతులను తయారు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి పాటలు పాడుతూ నృత్యం చేస్తూ భజనలు చేశారు. అమ్మవారి నామస్మరణ గ్రామంలో మార్మోగింది.

ప్రైవేటు క్లినిక్‌ల సీజ్

గుత్తి : నిబంధనలకు విరుద్ధంగా ఓ ఆర్‌ఎంపీ ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తుండగా మంగళవారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. గుత్తి పట్టణంలోని తురపల్లిరోడ్డులోని షాలోమ్ నగర్‌లో ఆర్‌ఎంపీ శేఖర్ ఎంబీబీఎస్ వైద్యుడి పేరుతో బోర్డులను ఏర్పాటు చేసుకుని క్లినిక్ నిర్వహిస్తున్నారు. రోగులకు సెలైన్ ఎక్కించడం, రక్త పరీక్షలకు సిఫార్సులు చేయడం చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో అధికారులు గుత్తికి వచ్చి తమ అనుమతి లేకుండా క్లినిక్‌ను కొనసాగిస్తుండగా క్లినిక్‌ను సీజ్ చేశారు. **బుక్కరాయసముద్రం :** బుక్కరాయసముద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి దేవి మంగళవారం సీజ్ చేశారు. కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన ఓ మహిళ ఇక్కడ చికిత్స తీసుకుని మృతి చెందినట్లు ఫిర్యాదు రావడంతో స్పందించిన ఆమె విచారణ చేశారు. క్లినిక్‌ను సీజ్ చేసి నిర్వాహకులు మునిరెడ్డికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. విచారణలో నిర్వాహకుడి తప్పు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక వైద్యశాలలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రవిశంకర్, స్వాతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గుత్తి : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు


యాడికిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


గుంతకల్లు : అబ్దుల్ కలాం జయంతిని నిర్వహిస్తున్న విద్యార్థిసేన నాయకులు

కలాం జీవితం అందరికీ ఆదర్శం

దివంగత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం గుంతకల్లు పొట్టిశ్రీరాము రోడ్డులో విద్యార్థిసేన ఆధ్వర్యంలో, గుత్తి పెన్షనర్ల సంఘం కార్యాలయంలో యాడికి మండలంలోని రాయలచెరువు ఉన్నత పాఠశాల, న్యూ వికాస్ పాఠశాల, యాడికి విజన్ హైస్కూల్‌లో అబ్దుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం దేశానికి చేసిన సేవలను విస్మరించరాదని పలువురు పేర్కొన్నారు. కలాం జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు లయన్స్ క్లబ్ సభ్యులు బహుమతులు అందజేశారు.

- న్యూస్‌టుడే, గుంతకల్లు, గుత్తి, యాడికి

పల్లెల ప్రగతికి కృషి: ఎమ్మెల్యే


గోకులం షెడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, న్యూస్‌టుడే : పల్లెలు ప్రగతి బాట పట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అరకటవేములలో జరిగిన పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, గోకులం షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చంద్రబాబు సంకల్పంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన నాయుడు, మండల కన్వీనరు బాలరంగయ్య, తెదేపా నాయకులు రంగయ్య, బ్రహ్మయ్య, పుల్లారెడ్డి, కులశేఖరరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని మేడిమాకులపల్లి, చింతలచెరువు, చిత్రచేడు, చిట్టూరు గ్రామాల్లో మంగళవారం పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ శ్రీదేవి, మండల ప్రత్యేకాధికారి వెంకటరమణానాయక్, ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, గృహనిర్మాణ శాఖ ఏఈ నెట్టికంటయ్య, ఏపీఓ పుల్లారెడ్డి, సర్పంచులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని సీసీరోడ్డు, పశువుల షెడ్డులకు భూమి పూజ నిర్వహించారు.

గార్లదిన్నె గ్రామీణం : మండలంలోని కనుంపల్లి, శిరివరం, తిమ్మంపేట పంచాయతీల్లో మంగళవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. కనుంపల్లిలో రూ.10 లక్షలు, శిరివరంలో రూ.10 లక్షలు, తిమ్మంపేటలో రూ.5 లక్షల సీసీ రోడ్డు పనులకు అధికారులు నాయకులు భూమి పూజ చేశారు. బుధవారం ఎం.కొత్తపల్లిలో జరిగే పల్లె పండగ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సురేంద్ర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


మేడిమాకులపల్లిలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ

అభివృద్ధి పనులకు శ్రీకారం

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని దోనిముక్కలలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం తెదేపా నాయకుడు గుమ్మనూరు నారయణస్వామి భూమి పూజ చేశారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.3 కోట్లతో రోడ్డు, మురుగు కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, గ్రామ సర్పంచి శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మండల ఇంజినీరు ఓబులేశు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శింగనమల : శింగనమల మండలం గుమ్మేపల్లిలో మంగళవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి గుమ్మేపల్లి సర్పంచి లలితమ్మ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


దోనిముక్కలలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం అవిష్కరించిన గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అమ్మవారికి బోనాలు

గార్లదిన్నె గ్రామీణం : మండలంలోని కె. కొట్టాలపల్లిలో వెలిసిన శ్రీపెద్దమ్మ అమ్మ వారికి మంగళవారం భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి బోనాలను డప్పులు, వాయిద్యాలతో తీసుకొచ్చి సమర్పించారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు కేశవరెడ్డి అమ్మ వారిని దర్శించుకున్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

గుంతకల్లు : మూత పడ్డ అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే జయరాం బుధవారం ఉదయం ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి క్యాంటీన్‌ను అన్నివిధాలా సిద్ధం చేశామన్నారు. ఇక ఆర్‌డీఓ కార్యాలయ సమీపంలోని డీఎల్‌డీఓ కార్యాలయాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకుని వ్యవసాయ మార్కెట్ యార్డులో అన్నదానం చేస్తారని పార్టీ నాయకులు చెప్పారు.

కసాపురంలో మన్యసూక్త హోమం

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో పుర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా యాగశాలలో మంగళవారం మన్యసూక్త హోమం నిర్వహించారు. యాగశాలలో శ్రీఆంజనేయస్వామి వారి ఉత్సవ మూర్తిని కోలువుదీర్చి పంచామృతాభిషేకం, అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి మన్యసూక్త హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ కె.వాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



విశేషంగా అలంకరించిన శ్రీఆంజనేయస్వామి వారి ఉత్సవమూర్తి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య : తాడిపత్రిలోని నందలపాడు రైల్వేస్టేషన్ సమీప వీధిలో మార్గబిలాలు స్తంభించి మురుగు బయటకు పొంగిపొర్లి రోడ్డుపై నిల్వ చేరడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. రాకపోకల్లో పాదచారులతో పాటు వాహన చోదకులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. **- బాబు, స్థానికుడు**

సమాధానం : వెంటనే సిబ్బందిని పంపి మురుగు లేకుండా శుభ్రం చేయిస్తాం. మార్గబిలాల్లో పేరుకున్న చెత్తను తొలగిస్తాం.

- తేజ, మున్సిపల్ ఏఈ, తాడిమర్రి – న్యూస్‌టుడే, తాడిపత్రి

రాళ్లే రక్షణ కవచాలు

గుంతకల్లు మండలంలోని నాగసముద్రం సమీపాన ఆర్‌అండ్‌బీ రోడ్డు నెల రోజుల కిందట కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వెళ్లాలని గ్రామస్థులు గుంతల వద్ద రాళ్లను ఉంచి ప్రమాద సూచికలుగా ఏర్పాటు చేశారు. చోదకులు ఏమాత్రం అజాగ్రత్త వహిస్తే ఆసుపత్రులుపాలు కావాల్సిందే. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం



భయం గుప్పెట్లో విధుల నిర్వహణ



వర్షం వస్తే గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించేందుకు భయాందోళన చెందుతున్నారు. కార్యాలయ పైకప్పు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా.. మరమ్మతులు చేపట్టకపోవడంతో పెచ్చులూడి పడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల కార్యాలయంలోకి అడుగుపెట్టాలన్నా ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరమ్మతుల విషయంపై ఎంపీడీఓ యోగానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపాం, నిధులు మంజూరయ్యాయి. వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, గార్లదిన్నె

ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక దిమ్మె



పెద్దవడుగూరులోని పోలీసుస్టేషన్ సమీపాన ఏర్పాటు చేసిన నియంత్రిక దిమ్మె ప్రమాదకరంగా ఉంది. దిమ్మె నెర్రలిచ్చి శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దిమ్మెకు మరమ్మతులు చేసి ప్రమాదం జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ ఏఈ షంషుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పెద్దవడుగూరు

మత్స్యకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని చెన్నంపల్లిలో మంగళవారం మత్స్యకార సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చిన్న నల్లప్ప, ఉపాధ్యక్షుడిగా కిష్టన్న, కార్యదర్శిగా నాగప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి తెదేపా నాయకులు శ్రీరామ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి శుభాభినందనలు తెలిపారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుదాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్

గుంతకల్లు, న్యూస్‌టుడే : పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ అధ్యక్షురాలు భవాని, కమిషనర్ నయీం అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మందిరంలో ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేతుల శుభ్రత ఆవశ్యకత గురించి వివరించారు. ప్రజలు చెత్తను రోడ్లపైన, కాలువల్లో పడేయడం మంచిదికాదన్నారు. చెత్తను బుట్టల్లో నిల్వ ఉంచి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయడం తమ కర్తవ్యంగా ప్రజలు భావించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, టీపీఆర్‌ఓ మోహన్, మెప్మా అధికారి కిరణ్, పారిశుద్ధ్య, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

గుత్తి, న్యూస్‌టుడే : సఫాయి కర్మచారి అభివృద్ధి సంస్థ సరఫరా చేసిన కిట్లను మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు పురపాలిక కమిషనర్ జబ్బార్‌మియా పంపిణీ చేశారు. కార్మికుల రక్షణ కోసం పీపీటీ కిట్లను ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీఓ అనంత నగరశాఖ సారథ్యంలో మంగళవారం హెచ్చెల్సీ కాలనీలో జరిగిన ఉచిత గుండె, నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. జోరుగా వాన కురిసినా అనేక మంది విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు తరలి వచ్చి వైద్య చికిత్స పొందారు. తొలుత ఈ శిబిరాన్ని ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఈ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కిమ్స్-సవీరా ఆస్పత్రి ఆధ్వర్యంలో మధుమేహం, రక్తపోటు పరీక్షలతోపాటు.. ఈసీజీ, 2డీ ఎకో వంటి గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షలు కూడా చేశారు. ఆ తర్వాత గుండె వైద్య నిపుణుడు సందీప్, నేత్ర వైద్యురాలు లహరి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు రాయించారు.

నాలుగు ప్రాంతాల్లో మహిళా మార్టులు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలోని 4 ప్రాంతాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి అవసరమైన భవనాలను ఎంపిక చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం సాయంత్రం డీఆర్‌డీఏ కార్యాలయంలో పలువురు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగా కణేకల్లు, ఉరవకొండ, యాడికి, గుంతకల్లు మండలాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. స్త్రీనిధి ద్వారా జిల్లాకు కేటాయించిన రూ.150 కోట్లు మహిళలకు వెంటనే అందివ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా వినియోగించాలన్నారు. బ్యాంకు రుణాలు రూ.1600 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారని నెలవారీగా లక్ష్యాలు చేరుకోవాలన్నారు.

అంతటా అప్రమత్తం.. అయినా ఆందోళన!

నగరంలో మురుగు కాలువలు: **430 కిలోమీటర్లు**

మరువ వంక, నడిమి వంక ఆక్రమణలు: **437 నివాసాలు**

పల్లపు ప్రాంతాల డివిజన్లు: **12**

పల్లపు ప్రాంతాలు మరువ వంక మీదుగా: బోయవీధి, ఉమానగర్, ఖాజా నగర్, వేణుగోపాల్‌నగర్, రెవెన్యూ కాలనీ, మహాత్మా గాంధీ కాలనీ, శిర్డీ నగర్

నడిమి వంక ప్రాంతాలు: పార్వతమ్మ కాలనీ, ఆజాద్‌నగర్, 5,6వ రోడ్లు, యువజనకాలనీ, రంగస్వామినగర్, ఇందిరా గాంధీనగర్, సోమనాథనగర్, రజకనగర్.

వంతెనలు, కల్వర్టులతో నీరు చేరే ప్రాంతాలు: అశోక్‌నగర్ బ్రిడ్జి, త్రివేణి టాకీస్ బ్రిడ్జి, శాంతి నర్సింగ్‌హోం, గుల్జార్‌పేట అమ్మవారిశాల ప్రాంతం, హౌసింగ్ బోర్డు, కోవూరు నగర్, రహమత్‌నగర్,రాంనగర్ అంబేడ్కర్ బ్రిడ్జి 80అడుగుల రోడ్డు, శ్రీనగర్ కాలనీ, సప్తగిరి కూడలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఓ వైపు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తుపాను ప్రభావం ఏ రూపంలో ఇబ్బంది పెడుతుందోనన్న ఆందోళన అయితే ఉంది. గతంలో మరువవంక, నడిమివంక పరిసర ప్రాంతాల ప్రజలకు మాత్రం వెన్నులో వణుకు పుడుతోంది. మంగళవారం ఉదయం ఓ మోస్తరు వర్షానికే నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో మురుగు, వర్షం నీరు నివాసాల ముందు నిలబడటం మరింత ఆందోళన రేకెత్తుతోంది. అనంతపురంతోపాటు శ్రీసత్యసాయి జిల్లాలో కురిసిన వర్షాల ప్రభావం నగరానికి ఉంటుంది. పై ప్రాంతాల్లో ఉన్న చెరువులు నిండితే నడిమి వంక మీదుగా వెళ్లే అవకాశం ఉండటంతో పరివాహ పల్లపు కాలనీల్లో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికీ అక్కడి ప్రజలు 2022 అక్టోబరులో చేసిన వర్షం గాయం నుంచి ఇంకా తేరుకోలేదు.



మరువ వంకకు అడ్డంగా ఉమానగర్ ఐరన్ బ్రిడ్జి వద్ద పూడిక మట్టి

పూడిక తీసి అక్కడే పడేసి!

వర్షం నీరు వెళ్లే రెండు ప్రధాన వంకలు మరువ వంక, నడిమి వంక. నీరు సజావుగా వెళ్లడం కోసం వైకాపా హయాంలో తీసిన పూడిక మట్టి అంతా వంకల్లోనే వదిలేశారు. రెండు ప్రధాన బ్రిడ్జి వద్దే ఉండటంతో పై ప్రాంతం నుంచి వచ్చే నీరు అంతా ఆగిపోయి వెనుక వైపున ఉన్న ఇళ్లలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల్లో బ్రిడ్జిల వద్ద అడ్డంగా ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్నారే గానీ పెద్ద ఎత్తున అడ్డంగా ఉన్న పూడిక మట్టి దిబ్బలు తొలగించే ప్రయత్నం చేయడం లేదు.

మట్టి కరిగితే అంతే సంగతులు

మరువ వంక ద్వారా నీరు శివారుకు వెళుతుంది. తెదేపా హయాంలో అమృత్ నిధులతో రక్షణ గోడ, అంతర్భాగంలో సిమెంటు నిర్మాణం చేపట్టారు. మహాత్మాగాంధీ కాలనీ వద్ద కొంత ఆగిపోవడంతో అక్కడ వేగంగా వెళ్లే నీరు సమీపంలోని నిర్మలానంద నగర్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మట్టి అడ్డంగా పెట్టారు. నీటి వేగానికి అది కాస్తా కొట్టుకొతే పరిస్థితి ఏంటన్న ఆందోళన ఉంది.



మహాత్మాగాంధీ కాలనీ వద్ద ఆగిన రక్షణ గోడ వద్ద మట్టి అడ్డంగా ఉంచారిలా

పల్లపు ప్రాంతాల్లో

నగరంలో భూగర్భ మురుగు కాలువలు లేవు. వర్షం నీరు ఎలా పడితే అలా ప్రవాహాలు పరుగులు పెడతాయి. మరువ వంక కలెక్టరేట్ వద్ద ఉన్న చిక్కవడియార్ చెరువు నుంచి ప్రారంభం అవుతుంది. మహాత్మా గాంధీ కాలనీ చివరన తడకలేరులో కలుస్తుంది. నడిమి వంక కక్కలపల్లి చెరువు నుంచి ప్రారంభమై రుద్రంపేట, నుంచి రజకనగర్ చేరి చివరకు తడకలేరులో కలుస్తుంది. వర్షం వస్తే నగరంలో ఏడు ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాల్లోనూ నీరు నిలిచే ఆస్కారం ఉంది.



నడిమి వంక నీరు పెరిగి రక్షణ గోడ లేక రజకనగర్‌లోకి వెళ్లే ప్రాంతం

ఏమైనా ఇబ్బంది ఏర్పడితే..

అనంత నగరపాలక: నగరంలో తుపాను వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు ఏర్పాటు చేశారు. కలెక్టరు వినోద్‌కుమార్ ఒకరోజు ముందే నగరంలోని పల్లపు ప్రదేశాలు, నడిమి వంక, మరువ వంక పరిసర కాలనీలను పరిశీలించారు. అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేయడంతో మంగళవారం నగరపాలక ఆధ్వర్యంలో పలు చర్యలు చేపట్టారు.



● నగరపాలకలో కమాండ్ కంట్రోలు రూం ఏర్పాటు చేశారు. ఫోన్లు, విద్యుత్తు సరఫరా ఆగినా ఇబ్బంది లేకుండా జనరేటర్ ఏర్పాటు చేశారు. ప్రజలు వరదల వల్ల ఏమైనా ఇబ్బంది ఏర్పడితే తక్షణమే ఫోను చేయడంతోపాటు వాట్సప్ ద్వారా సమాచారం అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు నగరంలో ఏమైనా ఇబ్బంది ఏర్పడితే తక్షణ సహాయం కోసం 08554 274765, 08554 230234, వాట్సప్ ద్వారా సమాచారం అందివ్వాలంటే 9849907388 సెల్‌కు అందించవచ్చు.

వ్యర్థాల తొలగింపు

నగరంలోని పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు, కాలువలకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అశోక్‌నగర్, రజకనగర్, ఖాజానగర్ బ్రిడ్జిల వద్ద మూడు హిటాచీలు ఏర్పాటు చేశారు. కైలాశం రోడ్డు, ఖాజానగర్, త్రివేణి టాకీస్, సాయినగర్ ఐదో క్రాస్, అశోక్‌నగర్, హౌసింగ్ బోర్డు, ఆజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 12 జేసీబీలతో కాలువలకు అడ్డంగా ఉన్న వ్యర్థాలను తొలగించారు. నగరంలోని 12 ప్రాంతాల్లో 21 ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలను తీసుకెళ్లడానికి ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 8 మంది నగరపాలక అధికారులను నియమించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: నగరంలోని భవానినగర్ ఎస్13/16 స్తంభానికి ఉన్న వీధిలైటు వెలగడం లేదు. **- షమీ ఉల్లా బేగ్**

సమాధానం: సిబ్బందిని పంపి లైటు వెలిగే విధంగా చర్యలు చేపడుతాం

సమస్య: నగరంలోని రాంనగర్ ప్రెసిడ్, శ్రీ సిరి టవర్స్ వద్ద కొద్దిగా వర్షం వస్తే మురుగు నీరు నిలబడి ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు**

సమాధానం: పరిశీలించి తగు చర్యలు చేపడుతాం

(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ రాధాకృష్ణ, డీఈ దాక్షాయిణి సమాధానాలు ఇచ్చారు) **- న్యూస్‌టుడే, అనంత నగరపాలక**



కాలువకు అడ్డంగా ఉన్న గోడను బద్దలు కొడుతున్న జేసీబీ

కాలువకు అడ్డంగా కట్టిన గోడ బద్దలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అమ్మవారి చెరువు నిండితే కాలువ వేగం ఊహించలేం. అలాంటి కాలువను మళ్లించి ఏకంగా గోడను అడ్డంగా కట్టినా వైకాపా కీలక నేత కావడంతో గత 19 నెలలుగా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కదలిక వచ్చింది. నగరంలోని సాయినగర్‌లో అమ్మవారి వంకకు సమాంతరంగా వెళ్లే కాలువను కుదించి కొత్తగా వైకాపా నేత కాలవ నిర్మాణం చేపట్టడంపై ఈనాడులో 2023 మార్చి 25న వంకర దారి..! శీర్షికతో, 2024 మే 9న ప్రజల గోడు పట్టదు..ఆయన స్థలానికి గోడ శీర్షికలతో ఈనాడులో కథనాలు ప్రచురించింది. అప్పట్లో అధికారులు, పాలకులు, పట్టణ ప్రణాళిక నోరు మెదపలేదు. స్థానిక 29వ డివిజన్ కార్పొరేటర్ ఈనెల 7వతేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా కాలువను కుదించి గోడ కట్టడంతో సాయినగర్‌లోని 5,6 క్రాస్‌ల్లోకి మురుగు, వర్షం నీరు చేరే ప్రమాదం ఉందని ఫిర్యాదు చేశారు. మంగళవారం అనంతపురం ఆర్డీఓ వసంత బాబు, కమిషనరు నాగరాజు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీకాంత్, నగర తహసీల్దార్ హరికుమార్, పట్టణ ప్రణాళిక అధికారులు, భారీ పోలీసు బందోబస్తుతో కాలువకు అడ్డంగా కట్టిన గోడను బద్దలు కొట్టించారు.

ప్రతి మండలంలో కంట్రోల్ రూం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: రాబోయే రెండురోజులు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున సహాయక చర్యల కోసం ప్రతి తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు అనంతపురం ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. సమాచారం కోసం 94931-88818 నంబరును సంప్రదించాలన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

రాప్తాడు: అనంతపురం రూరల్ కందుకూరు గ్రామ పొలాల్లో జూదరుల ఆడుతున్న ఏడుగురిని ఇటుకలపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సమాచారం రావడంతో స్థానిక ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయకుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. దాడిలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 బైకులు, 7 సెల్‌ఫోన్లు, రూ.30190 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సంగమేష్ నగర్‌లో మట్కా బీటర్లు..

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని సంగమేశ్‌నగర్‌లో మట్కా ఆడుతున్న ఇరువురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 3,950ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

కలాంకు నివాళి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: దేశం గుర్తుంచుకొనే మిస్సైల్ లాంటి వాడని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని మేయర్ వసీం కొనియాడారు. మంగళవారం నగరపాలకలో మిస్సైల్ పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు.

సీపీఆర్‌పై అవగహన నేడు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ప్రపంచ అనస్తీషియా దినోత్సవం సందర్భంగా అనంతపురంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సూపర్‌స్పెషాల్టీ హాస్పిటల్ డిప్యూటి సూపరింటెండెంట్, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి ప్రజలకు అనస్తీషియాపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 10.30 గంటలకు ఎస్పీ కార్యాలయంలోని ఆడిటోరియంలో పోలీసు అధికారులకు గుండెపోటు వచ్చిన వ్యక్తులకు సీపీఆర్ ఎలా చేయాలన్న అంశంపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.

అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు ఎనలేనివని పలువురు ఆచార్యులు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకొని ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ వెంకటనాయుడు మాట్లాడుతూ దేశంలో క్షిపణులు రూపకల్పన చేసిన మహానుభావుడన్నారు. రక్షణ రంగంలో దేశఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడన్నారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాళ్లు కృష్ణకుమారి, రామచంద్ర, సోమశేఖర్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు, ఆలోచనలు ఇంజినీరింగ్ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా జేఎన్‌టీయూ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు. అబ్దుల్ కలాం పేద కుటుంబం నుంచి వచ్చిన గొప్ప ఉపాధ్యాయుడు, గొప్ప శాస్త్రవేత్త అని కొనియాడారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్లు భానుమూర్తి, ఈశ్వరరెడ్డి, పద్మసువర్ణ, నాగప్రసాద్ నాయుడు, కిరణ్మయి, సుజాత, సురేష్‌బాబు, వైశాలి ఘోర్పడే పాల్గొన్నారు.

● జేఎన్‌టీయూ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

నేటి నుంచి గొర్రెలకు నట్టల నివారణ కార్యక్రమం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 30 వరకు గొర్రెలకు నట్టల నివారణ మందు తాపే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. జిల్లాకు 27 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. మొత్తం రూ.68 లక్షల విలువైన 27 లక్షల డోసులు మందు జిల్లాకు వచ్చిందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పశువైద్యశాలలు, ఏరియా ఆసుపత్రులకు నట్టల నివారణ మందును సరఫరా చేసి సిద్ధంగా ఉంచామన్నారు. పశువైద్యులు, సిబ్బంది క్షేత్రస్థాయిల ఉదయం, సాయంత్రం వేళల్లో గొర్రెలు గుంపుల వద్దకు వెళ్లి మందు తాపించాలన్నారు. ప్రతి కాపరి గొర్రెలు, మేకలకు ఈ మందు విధిగా తాపించాలని ఆయన కోరారు. ఈనెలాఖరు కార్యక్రమం వందశాతం పూర్తి చేయాలన్నారు



సిద్ధంగా నట్టల నివారణ మందు పెట్టెలు

ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక

రుద్రంపేట పంచాయతీ పరిధి పంతుల కాలనీలో ఓ ఇంటిపక్కనే విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయడంలో స్థానికంగా నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి గేటు పక్కనే విద్యుత్తు నియంత్రిక ఉండటం వలన ప్రమాదం జరుగుతుందమేనన్న స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. విద్యుత్తు ఉన్న ఫలంగా ఓల్టేజి సామర్థ్యం పెరిగినప్పుడు విద్యుత్తు నియంత్రిక ఫీజ్ వైర్ల నుంచి నిప్పు రవ్వలు వెలువడుతున్నందన భయమేస్తోందని స్థానికులు తెలిపారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**



పల్లపు ప్రదేశం.. సమస్యలు అనేకం

రాణినగర్, న్యూస్‌టుడే: అసలే పల్లపు ప్రదేశం. కొద్దిపాటి వర్షం వస్తే చాలు మురుగు నీరు అంతా ఇళ్ల ముందు నిలబడుతుంది. తాజాగా మురుగు కాలువ ఛిద్రం కావడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా, మురుగు కాలువలో ఏదైనా అడ్డంగా పడినా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాణినగర్ శివారు ప్రాంతంలో తీరని సమస్యగా మారింది. వైకాపా హయాంలోనే మురుగు కాలువ నిర్మాణం చేపట్టి రోడ్డు ఎత్తు పెంచాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధులు కేటాయించకుండా వదిలేశారు. రాణినగర్ ప్రారంభం నుంచి పలు నివాసాల మీదుగా వచ్చే మురుగు, వర్షం నీరంతా శివారులోని వినాయనగర్ వద్ద ఉన్న ఇళ్ల వద్దకు రాగానే ఇబ్బందిగా మారుతోంది. మంగళవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి మురుగు నీరు ఇళ్ల ముందుకు చేరింది.



కొద్దిపాటి వర్షానికే ఇళ్ల ముందు నిలబడిన మురుగు



ఛిద్రమైన మురుగు కాలువ

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి: సీపీఎం

బొమ్మనహాళ్, రాయదుర్గం, కణేకల్లు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాకు తాగు, సాగునీరు అందించే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో తగినన్ని నిధులు అధికార పార్టీలు కేటాయించకుండా నిర్వీర్యం చేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. మంగళవారం ఉంతకల్లులో హెచ్చెల్సీ వద్ద ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే హెచ్చెల్సీ ఆధునికీకరణ, ఉంతకల్లు రిజర్వాయర్ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ గట్లు, లైనింగ్, వంతెనలు దెబ్బతిని సాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. ఈనెల 21న అనంతపురం కలెక్టరేట్ వద్ద బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. అనంతరం బస్సు యాత్ర కణేకల్లు, రాయదుర్గంలో కొనసాగింది. సీపీఎం కర్ణాటక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్తి బాబు, కవుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలరంగయ్య, నాయకులు నాగేంద్ర, చంద్రశేఖర్, నాగమణి, కృష్ణమూర్తి, అచ్యుత ప్రసాద్, రంగారెడ్డి, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.



హెచ్చెల్సీ గట్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

19న సీనియర్ మహిళల జోనల్ ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాజమాత జిజాబాయి సీనియర్ అఖిల భారత జోనల్ మహిళల ఫుట్‌బాల్ పోటీలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డేనియల్ ప్రదీప్ తెలిపారు. ఆర్డీటీ ఫుట్‌బాల్ మైదానంలో జరిగే ఈ పోటీలు ఈ నెల 23 వరకు నిర్వహిస్తామని ఆయన వివరించారు. గ్రూప్-ఎఫ్‌లో ఉన్న వివిధ రాష్ట్రాల జట్లు ఇక్కడ పాల్గొంటాయి. ఒడిశా, లడఖ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయి.

కంప్యూటర్ల అదృశ్యంపై విచారణ జరిపించాలి

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ప్రయోగశాలలో కంప్యూటర్ విడిభాగాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలో కంప్యూటర్లు అదృశ్యంపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమణయ్య డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనితకు వినతి పత్రం సమర్పించారు. రమణయ్య మాట్లాడుతూ.. 2021 జులై 31న సైన్స్ బ్లాక్‌లో కంప్యూటర్ల విడిభాగాలు చోరీ అయ్యాయి. ఈ ప్రయోగశాల రూసా నిధులతో నిర్మించారు. వర్సిటీలో ప్రయోగశాలలు విద్యార్థులకు ఉపయోగ పడకుండా పోయాయి. అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టలేదన్నారు.

ఘనంగా తెదేపా జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : అనంతపురం జిల్లా తెదేపా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ జన్మదిన వేడుకలు మంగళవారం అనంతపురం జిల్లా తెదేపా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కార్యాలయానికి తరలివచ్చారు. అధ్యక్షుడికి బొకేలు, పూలదండలు, శాలువాలతో సత్కరించారు. ఆ తర్వాత భారీ కేకును కోసి అందరికీ పంచిపెట్టారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలంనరసానాయుడు, ద్విసభ్య కమిటీ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లా గ్రంథాలయం మాజీ అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, జేఎల్ మురళీధర్, రాయల్ మురళి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, లింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలక్షి, తెలుగు యువత నెట్టెం బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతపురం పెద్దాసుపత్రి వద్ద కురుబ నారాయణస్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



తెదేపా జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

రూ.3 కోట్లతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు

లెక్చరర్స్‌కాలనీ (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు గ్రామ పంచాయతీల్లో పనులన్నీ పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ గ్రామాల్లో అమలు చేస్తామని మరోసారి హామీ ఇచ్చారు. నాలుగు గ్రామ పంచాయతీల్లో రూ. 3 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం అనంతపురం గ్రామీణ మండలం రాజీవ్‌కాలనీ పంచాయతీలో రూ. 70 లక్షల అంచనాతో సిమెంటు రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. గ్రామాలను అభివృద్ధి చేయాలన్న తలంపుతో ఉప సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జలజీవన్ కింద రాజీవ్‌కాలనీ పంచాయతీలో తాగునీటి సమస్యకు రూ. 1.90 కోట్లతో చేయాల్సిన పనులు టెండరు దశలోనే ఆగాయని వాటిని పూర్తి చేయాలని సర్పంచి ఆశాబీ కోరారు. రామయ్యకాలనీ ముంపునకు గురికాకుండా రక్షణ గోడలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనులన్నీ పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

చోరీ.. క్షణాల్లో పరారీ

● ఒంటరి మహిళలే లక్ష్యం



కోవూరునగర్‌లో చోరీ చేసి ఉడాయిస్తున్న దొంగలు (సీసీ కెమెరా చిత్రం)

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వెంటాడి మరీ చోరీలకు పాల్పడుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ దొంగతనాలు చేస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నారు. ఈ నెలలోనే మూడుచోట్ల ఈ తరహా ఘటనలు చోటు చేసుకున్నాయి.. తరచూ అపహరణలు జరుగుతున్నా వాటిని నియంత్రించడంలో పోలీసుశాఖ విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.

● గత ఆదివారం తెల్లవారుజామున కోవూరు నగర్‌లో మహిళ లక్ష్మీదేవి ఇంటి ముందు పూలు కోస్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు హెల్మెట్లు ధరించిన దుండగులు ఆమె మెడలో రెండున్నర తులాల బంగారు గొలుసును అపహరించుకుని ద్విచక్ర వాహనంలో తప్పించుకున్నారు. శనివారం తెల్లవారుజామున సాయినగర్ నాలుగో క్రాస్‌లో ఓ మహిళ ఉంటి ముందు ముగ్గువేస్తుండగా, ఇద్దరు దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చి గొలుసు చోరీ చేయడానికి ప్రయత్నించగా ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయినగర్ 8వ క్రాస్‌లో దొంగలు దుకాణాలకు అమర్చిన ఎలక్ట్రిక్ బల్బులు అపహరించారు.

● దొంగలు ఒంటరి, వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న ఘటనల్లో దొంగలు రెండు విధాలుగా చోరీలకు పాల్పడ్డారు. కొన్నింటిలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో రావడం.. ఒకరు చోరీకి వెళ్లడం మరొకరు వెంటనే తప్పించుకోవడానికి వాహనాన్ని స్టార్టింగ్‌లో పెట్టుకుని ఉడాయించడం జరుగుతోంది. కిరాణా కొట్లు, ఇతర దుకాణాలు నడుపుతున్న ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్నారు. తెల్లవారుజామున ఉదయం నడకకు వెళ్లేవారు, ఇళ్ల ముందు కళ్లాపి చల్లి, ముగ్గులు వేసే మహిళలను.. అదే రాత్రి వేళ దుకాణాలు మూసి వెళ్లే క్రమంలో జనసంచారం లేని చోట, వెలుతురు లేని చోట నక్కి చోరీలు చేస్తున్నారు.

నిఘా ఎక్కడ?

జిల్లాలో తరచూ ఒకే తరహాలో ఘటనలు జరుగుతున్నా వాటిని అరికట్టడంలో విఫలమవుతున్నారు. పూర్తి స్థాయిలో దొంగలను పట్టుకున్న సందర్భాలు తక్కువే. కూడళ్లు, దుకాణాలు, అపార్టుమెంట్లు లోపల, బయట ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పెద్ద ఎత్తున ప్రచారం చేసినా కొద్దివరకే సత్ఫలితాలను ఇచ్చింది. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారి భరతం పట్టడానికి ప్రత్యేక ప్రణాళికలు, వ్యూహాలేవీ పాటించినట్లు లేదు. చైన్ స్నాచింగ్ కేసుల్లో రికవరీ శాతం చాలా తక్కువగా ఉంది. పోలీసు పెట్రోలింగ్ కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది.

విద్యుత్తు సమస్యలు రానివ్వొద్దు: ఎమ్మెల్యే సునీత

అనంతపురం (వ్యవసాయం): గత ప్రభుత్వం లాగా ఈ ప్రభుత్వంలో రైతులకు విద్యుత్తు సమస్యలు రాకుండా చూడాలని రాప్తాడు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరిటాల సునీత ఆదేశించారు. గతంలో విద్యుత్ కోతలు, లో ఓల్టేజ్ సమస్యలతో పంటలు ఎండిపోయాయని, ఆ పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లో రానివ్వొద్దన్నారు. మంగళవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర, ఈఈ శివరాం ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో నెలకున్న విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధానంగా విద్యుత్ నియంత్రికల కోసం ఏళ్ల తరబడి రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రాధాన్యం ప్రకారం విద్యుత్తు నియంత్రికలు వచ్చేలా చూడాలన్నారు.



సునీతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఈ సురేంద్ర

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు): తెదేపా సభ్యత్వ నమోదు అంటే గుర్తింపు మాత్రమే కాదు. ఒక కుటుంబానికి భరోసా ఉంటోందని రాప్తాడు ఎమ్మెల్యే, మాజీమంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో తెదేపా సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెదేపాలో రూ.100 లతో సభ్యత్వం తీసుకుంటే రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా ఉండేదని, తాజాగా రూ.5 లక్షలకు పెంచారన్నారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందన్నారు.